# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




# శ్రీసిటీని సందర్శించిన జపాన్ రాయబారి

## న జపాన్ పరిశ్రమలకు అత్యంత అనువైన స్థావరంగా కితాబు



సత్యవేడు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:

భారత్‌లోని జపాన్ రాయబారి ఒనో కెయిచి సోమవారం శ్రీసిటీని సందర్శించారు. గత నవంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇది ఆయన మొట్ట మొదటి శ్రీసిటీ పర్యటన. చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ తకహషి మునియో, ఇతర అధికారులతో కలసి పర్యటనకు విచ్చేయగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదరస్వాగతం పలికారు. తొలి సారి శ్రీసిటీ సందర్శనే అజెండాగా జపాన్ రాయబారి ఇక్కడ పర్యటనకు రావడం తమకు గర్వంగా ఉందని ఈ సందర్భంగా డా. సన్నారెడ్డి వ్యాఖ్యనించారు. రాయబారికి శ్రీసిటీ ప్రగతిని వివరిస్తూ 31 దేశాలకు చెందిన 235 కంపెనీలకు నిలయమైన శ్రీసిటీ, దేశంలోని ప్రముఖ పారిశ్రామిక కేంద్రాల్లో ఒకటిగా పేర్కొన్నారు. శ్రీసిటీలోని వివిధ జపనీస్ కంపెనీలకు చెందిన ఉన్నతాధికారులతో లంచ్ సమావేశంలో పాల్గొన్నారు. శ్రీసిటీ వ్యాపారానుకూల వాతావరణం, యాజమాన్య సహకారం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన కంపెనీల ప్రతినిధులు, తమ అభిప్రాయాలను, ఆలోచనలను ఆయనతో పంచుకున్నారు. అనంతరం స్థానిక డైకిన్, యూనిచార్మ్ పరిశ్రమలను సందర్శించి, అక్కడ ఉత్పత్తులు ఇతర కార్యకలాపాలను పరిశీలించారు.

## కుప్పం మున్సిపల్ పీఠం

# అధికార తెదేపా కైవశం !!

**-నూతన ఛైర్మన్‌గా తెదేపా కౌన్సిలర్ సెల్వరాజ్ ..**
**- వైఎస్సార్సీకి 'షాక్' ఇచ్చిన సొంత పార్టీ కౌన్సిలర్లు..**
**నలుగురు తెదేపాకు మద్దతు !!**






ఛైర్మన్ ఎన్నికను నిర్వహిస్తున్న దృశ్యం

కుప్పం మున్సిపల్ ఛైర్మన్‌గా డిక్లరేషన్ అందుకుంటున్న సెల్వరాజ్

కుప్పం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో ఎంతో కీలకమైన మున్సిపల్ ఛైర్మన్ పీఠాన్ని అధికార తెలుగుదేశం పార్టీ కైవశం చేసుకుంది. సోమవారం కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో పరిశీలకులు జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ప్రిసైడింగ్ అధికారి, కుప్పం ఆర్డీఒ శ్రీనివాసులు రాజు ఛైర్మన్ ఎన్నికను పటిష్ట భద్రత మధ్య నిర్వహించారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, వైకాపా నుంచి ఎమ్మెల్సీ భరత్ హాజరయ్యారు. ఛైర్మన్ పదవికి తెదేపాకు చెందిన ఐదో వార్డు కౌన్సిలర్ పేరును 19వవార్డు కౌన్సిలర్ జిమ్‌దాము ప్రతిపాదించగా 20వ వార్డు కౌన్సిలర్ సోమశేఖర్ బలపరిచారు. వైకాపా ఛైర్మన్ అభ్యర్థిగా హాఫీజ్ పేరును కౌన్సిలర్ మునిరాజు ప్రతిపాదించగా మరో కౌన్సిలర్ నాగరాజు బలపరిచారు. అయితే అప్పటికే ఎన్నికకు సంబంధించి ఎన్నికైన కౌన్సిలర్లు 22మంది చేరుకుని ఉండగా ఛైర్మన్ పదవికి సంబంధించి తెదేపా కౌన్సిలర్ అయిన సెల్వరాజ్‌కు 15మంది మద్దతు పలకగా వైకాపా కౌన్సిలర్ అయిన హాఫీజ్‌కు కేవలం 9మంది మాత్రమే మద్దతు పలికారు. దీంతో ఎన్నికల్లో తెదేపా కౌన్సిలర్ సెల్వరాజ్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి శ్రీనివాసులు రాజు ప్రకటించి ధృవీకరణ పత్రాన్ని అందించారు.

**వైఎస్సార్సీకి షాక్ ఇచ్చిన కౌన్సిలర్లు :**

2021 మున్సిపల్ ఎన్నికల్లో 25 కౌన్సిలర్ స్థానాలకు 19 కౌన్సిలర్ స్థానాలు దక్కించుకున్న వైఎస్సార్సీకి సోమవారం కౌన్సిలర్లు మరో షాక్ ఇచ్చారు. గతేడాది వైకాపాను వీడి నలుగురుమంది కౌన్సిలర్లు తెదేపాలో చేరగా సోమవారం మరో నలుగురు కౌన్సిలర్లు తెదేపాకు మద్దతు పలికారు. ఇద్దరు మంది కౌన్సిలర్లు ఎన్నికకు హాజరు కాలేదు. కుప్పం మున్సిపాలిటీలో తెదేపా బలం ప్రస్తుతానికి 14కు చేరుకుంది. సోమవారం నాటి ఎన్నికలో అధికార తెదేపాకు వైకాపా తరపున ఎంపికైన కౌన్సిలర్లు అరవింద్, చంద్రమ్మ, దేవకి, సయ్యద్ అలీలు మద్దతు పలికారు.

**ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు :**

కుప్పం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సోమవారం ప్రశాంతంగా ముగిసింది. 11గంటలకు ప్రారంభమైన ఎన్నిక 11.30గంటలకల్లా ముగిసింది. పోలీసు అధికార యంత్రాంగం గట్టి చర్యలు చేపట్టింది. తొలుత అధికార తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు బయటకు రాగా ఆపై వైఎస్సార్సీ కౌన్సిలర్లను బయటకు పంపారు. మండల కార్యాలయం వద్ద భారీ భద్రత ఏర్పాటుచేశారు.

### వైఎస్సార్సీ నుంచి కౌన్సిలర్ల సస్పెన్షన్‌కు సిఫార్సు : ఎమ్మెల్సీ భరత్

కుప్పం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల్లో పార్టీ విప్‌ను ధిక్కరించిన పదిమంది కౌన్సిలర్లను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ జిల్లా వైకాపా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డికి ఎమ్మెల్సీ భరత్ సిఫార్సు చేశారు. వైకాపా తరపున ఎంపికై విప్ ధిక్కరించిన వారిలో కౌన్సిలర్లు జగదీష్, అరవింద్, రాజమ్మ, చంద్రమ్మ, హంస, మునస్వామి, తిలగవతి, దేవకి, లావణ్య, సయ్యద్ అలీ తదితరులు ఉన్నారు. వెంటనే ఈ సిఫార్సును ఆమోదించి వారిపై పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని లేఖలో పేర్కొన్నారు.



# ఘోరప్రమాదం!



**ఒకే కుటుంబంలో ఐదుమంది దుర్మరణం**
**పాకాల తోటపల్లి వద్ద కంటైనర్‌ను ఢీకొన్న కారు**
**-సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**



పాకాల, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

తిరుపతి–చిత్తూరు రహదారిలో సోమవారం మధ్యాహ్నం ఘోరరోడ్డుప్రమాదం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుమంది కర్నాటక భక్తులు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు క్షతగాత్రులయ్యారు. ముందువెళుతున్న కంటైనర్‌ను వెనుకనుండి కారు ఢీకొని లోపల ఇరుక్కుపోవడంతో సంఘటనాస్థలంలోనే కారులోని ప్రయాణీకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో బెంగుళూరు సౌత్ సుబ్రమణ్యపురాకు చెందిన విజయలక్ష్మి(50), బిఎస్ సహానా(34), ఎస్ఆర్ రజినీ(27), ఆర్.లేఖన్‌గౌడ్(11), క్రిస్విన్(15) ఉన్నారు. కారులో ఉన్న మరో ఇద్దరు కర్నాటక హసన్ సబ్బన్నహళ్లికి చెందిన గీతమ్మ(51), తమిళనాడు క్రిష్ణగిరికి చెందిన ఎంఎస్ త్యాగరాజన్ క్షతగాత్రులయ్యారు. ఘోరరోడ్డుప్రమాదం జరగడంతో స్థానికులు, 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనాస్థలిలో క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే పాకాల పోలీసులు హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాలను కారులోంచి బయటకు తీసి తిరుపతి ఎస్వీవైద్యకళాశాలకు తరలించారు. సమాచారం అందుకున్న తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజులు ప్రమాదస్థలికి చేరుకుని కారాణాలను ఆరా తీశారు.

**-దేవుని దర్శనం ముగించుకుని తిరుగుప్రయాణంలో:**

కర్నాటక సబ్బనహళ్ళి బెంగుళూరుసౌత్‌కు చెందిన ఒకే కుటుంబంలో ఆరుగురు ఆదివారం సెలవు కావడంతో తిరుమలకు వచ్చారు. సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం కారులో తిరుగుప్రయాణమయ్యారు. కారు అతివేగంగా నడపడంతో పాకాల తోటపల్లి జాతీయరహదారిపై మృత్యురూపంలో కంటైనర్‌ను ఢీ కొనడంతో ఒకే కటుంబంలో ఐదుగురు మృత్యువాతపడ్డారు. ఎక్కడో బెంగుళూరులో నివాసముంటున్న వీరంతా దేవుని దర్శనానంతరం తిరుగుప్రయాణంలో పాకాల వద్ద ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం బంధువులు, స్నేహితులు రోధిస్తున్నారు. మృతుల బ్యాగ్‌లు, వస్తువులు అన్నీ చెల్లాచెదురై ఎగిరిపడ్డాయి.

**-ముఖ్యమంత్రి,మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి:**

తిరుపతి జిల్లా పాకాల వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో కర్నాటక వాసులు ఐదుగురు మృతి చెందిన సంఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కారులోని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. గాయపడిన వారికి, బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా సాయం అందించాలని సిఎం అధికారులను ఆదేశించారు. కాగా రాష్ట్రరవాణామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఈ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ప్రయాణీకులు,యాత్రికులు జాతీయరహదారులపై వాహనాలను నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ,అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

### క్షత గాత్రులకు స్విమ్స్‌లో మెరుగైన చికిత్స



తిరుపతి హెల్త్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :

పాకాల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సూచించారు.

## ఏనుగుల గుంపుచే రైతు దుర్మరణంపై ఉప ముఖ్యమంత్రి పవన్ సమీక్ష

**- ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు**

తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఏనుగుల గుంపుచే పంటల ధ్వంసం–రైతు దుర్మరణంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్షించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఆదేశాలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఏనుగుల భీభత్సంపై అటవీ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల ఏనుగుల దాడిలో చిన్నగొట్టిగల్లులో ఒక కౌలు రైతు ఏనుగుల దాడిలో చనిపోవడం బాధాకరమని, తాజాగా పాకాల మండలం గానుగుపెంటలో పంటలు ధ్వంసం చేసిన ఘటనలపై అటవీ శాఖ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏనుగుల గుంపును కట్టడి చేయడానికి తగు చర్యలు తీసుకోవడంతో పాటు తిరుపతి డీఎఫ్‌వో ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పవన్ కల్యాణ్ ఆదేశాలను అనుసరించి తిరుపతి డీఎఫ్‌వో పి. వివేక్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. చిత్తూరు డీఎఫ్‌వో ఎస్. భరణితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌కి సంబంధించిన పీలేరు, తిరుపతి డీఎఫ్‌వోలు తిరుపతి సబ్ డీఎఫ్‌వోలతో పాటు తిరుపతి భాకరాపేట, పనపాకం, చిత్తూరు ఈస్ట్, చిత్తూరు వెస్ట్ పరిధిలో ఎఫ్ఆర్‌వోల టీమ్స్ పది మంది ఎలిఫెర్ ట్రాకర్స్, ఈ టాస్క్ ఫోర్స్‌లో ఉంటారు. వీరి బాధ్యతలను కూడా నిర్దేశిస్తూ పవన్ కల్యాణ్ ఉత్తర్వులు విడుదల చేశారు.

## డిసిసిబి పర్సన్ ఇన్‌ఛార్జిగా మరోసారి అమాస

చిత్తూరురూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



సుదీర్ఘకాలం పాటు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్‌గా విధులు నిర్వర్తించిన అమాస రాజశేఖర్‌రెడ్డిని ప్రభుత్వం మరోసారి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమిం చింది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 13 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమిస్తూ జాబితా విడుదల చేసింది. ఈ మేరకు చిత్తూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జిగా అమాస రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. సుదీర్ఘకాలం పాటు జిల్లా వ్యాప్తంగా వున్న మండల ప్రాథమిక వ్యవసాయ పరపతి(సింగింల్ విండో) పాలకవర్గాలకు ఎన్నికలు జరుగలేదు. గత ప్రభుత్వంలో సైతం జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు పర్సన్ ఇన్‌ఛార్జిలను నియమించి బ్యాంకు పాలనా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ప్రభుత్వం మండల వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ఎన్నికలు నిర్వహించడానికి సిద్దమైందని ప్రచారం జరిగింది. అయితే ఈ ఎన్నికల్లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్‌గా ఎన్నిక కావడానికి అన్ని హంగులు వున్న వారికి మొదటి బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమించి ఆపై మండల ప్రాథమిక సహకార పరపతి సంఘాల ఎన్నికలకు వెళ్ళాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జీ కోసం జిల్లా నుండి తెరపైకి ఇద్దరి తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్లు వచ్చినప్పటికీ సహకార రంగంలో సుదీర్ఘ అనుభవం వున్న డిసిసిబి మాజీ ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డిని ప్రభుత్వం మరోసారి పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమించింది.

## ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇవ్వాలి: కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నుంచి వచ్చిన అర్జీదారులకు వేసవి దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన పీజీఆర్ఎస్ పరిష్కార వేదిక ఆవరణలో వారు కూర్చోవడానికి వీలుగా కుర్చీలు, త్రాగు నీటి సౌకర్యంతో పాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో పాటు డీఆర్వో నరసింహులు, డెప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, సుధారాణి, రోజ్‌మాండ్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి 285 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు రెఫర్ చేసి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## మేనకూరులో పుట్టుకొస్తున్న అక్రమ లేఅవుట్లు ...

నాయుడుపేట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

నాయుడుపేట మండలంలోని మేనకూరులో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా రోజురోజుకు పుట్టుకొస్తున్న సంబంధిత ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశ్రామిక వాడగా ధినధిన అబివృద్ధి చెందుతున్న మేనకూరులో ఇంటిస్థలాలకు డిమాండ్ పెరగడంతో దాన్ని అవకాశంగా తీసుకొన్న రీయల్టర్లు మాయజాలం ప్రదర్శిస్తూ ఎక్కడ పడితే అక్కడ నామ మాత్రంగా అక్రమ లేఅవుట్లు ఏర్పాటుచేసి ప్రజలను మోసం చేస్తున్నారు. తుడా ప్లానింగ్ నిబంధనల మేరకు రీయల్టర్లు లేఅవుటు వేసేట ప్పుడు ముప్పైఅడుగల రోడ్లు,డ్రైనేజికాలువలు, వాటరు, విధ్యుత్ సర్వీస్సు,మొక్కల పెంపకం,లేఅవుట్లో పదిశాతం భూమిని పంచాయితీ కార్యధర్శి పేరుతో మార్టుగేజ్‌చేసి తుడా ప్లానింగ్ అధికారుల నుండి అనుమతులు తీసుకోవాల్సి ఉండగా నాయుడుపేట మండలంలోని మేనకూరులో మాత్రం రీయల్టర్లు అలాంటి నిబంధనలు పాటించకుండ మాయజాలం ప్రదర్శిస్తూ ఇష్టారాజ్యంగా లేఅవుట్లువేసి ఏలాంటి అనుమతులు లేకుండనే ప్లాట్లు అమ్మకాలు చేపడుతూ ప్రజలను దగా చేస్తున్నారు.

**పట్టించుకోని ప్లానింగ్ అధికారులు**



మేనకూరులో వేస్తున్న అక్రమ లేఅవుట్లుకు పంచాయితీ అధికారులు పలుధపాలుగా నోటీసులు జారీచేసిన పట్టించుకోకుండ ప్లాట్లు అమ్మకాలు చేపడుతున్నారు. ఈవిషయమై ప్రభాతవార్త తిరుపతి తుడా ప్లానింగ్ అధికారి శైలజాను వివరణ కోరగా ఆమె మాట్లడుతూ నాయుడుపేట మండలంలోని మేనకూరులో వేస్తున్న లేఅవుట్లుకు ఏలాంటి అనుమతులు ఇవ్వలేదని వాటిని పరిశీలించి అక్రమ లేఅవుట్లుకు నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటామని ఆమె తెలియజేశారు.

# ఎసిబి వలలో రెవెన్యూ సర్వేయర్

**విచారణ వేగవంతం**
**ప్రిన్సిపల్ ఫిర్యాదుతో గుట్టురట్టు**





లంచంతీసుకుంటూ పట్టుబడినసర్వేయర్ పురుషోత్తం, తమ బాధలనువివరిస్తున్న బాధితులు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి రెవెన్యూ శాఖలో విచ్చలవిడి అవినీతికి చెక్‌పడింది.సోమవారం శ్రీకాళహస్తి రెవెన్యూ కార్యాలయంలో సుమారు ఆరుగంటల పాటు ఎసిబి అధికారులు విచారణ జరిపారు. ఈ నేపధ్యంలో లంచం తీసుకుంటూ మండల సర్వేయర్ పురుషోత్తం పట్టుబడ్డారు. శ్రీకాళహస్తి రెవెన్యూ కార్యాలయంపై చాలా కాలంగా అవినీతి ఆరోపణలు సాగుతున్నాయి. లంచం ఇస్తే అంతా ఒకే.లేకుంటే ఏళ్ల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సిందే. ఎసిబి అధికారులు లోపల విచారణ జరుపుతుంటే బయట ఏళ్ల తరబడి ఈ కార్యాలయం చుట్టు తిరుగుతున్న మహిళలు తమ బాధలను మీడియాకు వివరించటం గమనించదగ్గ విషయం,

**రికార్డులుమార్చటం లంచాలు గుంజటం:**

శ్రీకాళహస్తి రెవెన్యూశాఖ కార్యాలయంలో కొందరు అధికారులు నిరుపేదల సమస్యలతో వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. సాక్షాత్తు శాసనసభ్యుడే పలు శాఖల అవినీతి గురించి ప్రస్తావించటం గమనించదగ్గ విషయం.రికార్డులుమార్చటం లంచాలు గుంజటం బాధితులను ఏళ్ళ తరబడి కార్యాలయం చుట్టు తిప్పుకోవటం గమనించదగ్గ విషయం.ఈ నేపధ్యంలో సర్వేయర్ పురుషోత్తం రూ.25వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డారు.సోమవారం ఎసిబి అడిషనల్ ఎస్‌పి విమల కుమారి,డివైయస్‌పి ప్రశాంతి, సిఐ నరసింహారావు వారి సిబ్బంది ఆకస్మిక దాడి జరిపారు.ఈ నేపధ్యంలో సోమవారం ఆకస్మికదాడికి సంబంధించి ఎఎస్‌పి విమల కుమారి మీడియాతో మాట్లాడుతూ తమకు స్పష్టమైన అవినీతి ఆరోపణలతో పిర్యాదు చేస్తే తాము ఎంతటి వారైనా వదలిపెట్టేది లేదన్నారు. రిటైర్డ్ ఐటిటికి చెందిన ప్రిన్సిపల్ చంద్రశేఖర్ 2000 సంవత్సరం 70 సెంట్లు భూమిని కొనుగోలు చేసారు. ఫిబ్రవరి 2025లో వ్యవసాయభూమినినాన్‌అగ్రికల్చరల్ భూమిగా మార్చుకొనుటకు రూ.1,70,000 చలానుకట్టి తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఆతని దరఖాస్తును రెవెన్యూ అధికారులు ౦రెండు సార్లు తిరస్కరించారు. మూడో సారి రెవెన్యూ అధికారిని కలసిన చంద్రశేఖర్‌ను రెవెన్యూ అధికారులు సర్వే చేయించుకోవాలని సూచించారు.దాంతో చంద్రశేఖర్ మండల సర్వేయర్‌ను కలవగా రూ.30వేలు డిమాండ్‌చేసినట్లు అంత ఇవ్వలేనని రూ.15,000 ఇస్తామనటం చివరకు రూ.25వేలు ఇవ్వాలని పురుషోత్తం రెడ్డి డిమాండ్ చేసినట్లు తెలిపారు. అయితే ఓ ఉద్యోగిగా లంచం ఇవ్వటం ఇష్టం లేక చంద్రశేఖర్ తమను కలసినట్లు వివరించారని విమల కుమారి వివరించారు.సోమవారం సర్వేయర్ పురుషోత్తం రూ.25వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారని వివరించారు.ఈ మేరకు ఎసిబి అధికారులతో ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి చర్చించారు.

**బాధితుల పిర్యాదు:**

శ్రీకాళహస్తి రెవెన్యూ కార్యాలయం వద్దకు సోమవారం పలువురుగ్రామస్తులు ఉన్నారు. అయితే వారందరూ బాధితులే. కొందరి వద్ద సొమ్ములు తీసుకొని పరిష్కరించని వారు.మరి కొందరి వద్ద అడంగల్ తీసుకొని తిప్పుకుంటున్న వారు తమ బాధలను డియస్‌పి ప్రశాంతికి తమ బాదలనువివరించారు. వెంకటాపురానికి చెందిన రైతులు చల్లపాళెంలోని నేలకు సంబంధించి ఉమ్మడికుటుంబంలో భాగపరిష్కారాలు కాగా సర్వేయర్ తమ వద్ద అడంగల్ ఉన్నా తమ బంధువులపేరరికార్డులు ఇచ్చారని తమబాధలను రికార్డులను చూపారు. కాగా కొత్తూరుకు చెందిన బాధితులు తాము అడంగల్ చేతపట్టుకొని ఐదేళ్లుగా తిరుగుతున్నామని తమ బాధలను వివరించారు.

## "పల్లినేని" పనితీరుకు "పట్టాభిషేకం"

**డిసిఎంఎస్ ఛైర్మన్‌గా పల్లినేని సుబ్రమణ్యం నాయుడు**



చంద్రగిరి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:

టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు పనితీరుకు పట్టాభిషేకం జరిగింది. పనపాకంకు చెందిన పల్లినేని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడుగా 9 ఏళ్ళ నుండి కొనసాగుతున్నారు. టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని విజయం కోసం ఆయన అహర్నిశలు విశ్రాంతి లేకుండా శ్రమించారు. చరిత్రలో కనీవినీ ఎరుగని అఖండ విజయాన్ని పులివర్తి నానికి అందజేశారు. ఈ నేపథ్యంలో ఎంఎల్ఏ పులివర్తి నాని సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో డిసిఎంఎస్ పదవికి ఎంపిక చేయబడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం, నాయకుడి కోసం పనిచేసిన ఏ ఒక్కరినీ పార్టీ వదలిపెట్టదని అన్నారు. ప్రతి ఒక్కరూ నావెన్నంటి నిలిచి 2024 సార్వత్రిక ఎన్నికలలో నాని అన్న విజయంలో కొండంత బలాన్నిచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తనకు పదవి రావడానికి సహకరించిన పులివర్తి కుటుంబానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సిఎం చంద్రబాబుకు కానుకగా కుప్పం గెలుపు

- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్
- వైఎస్సార్సీ విధ్వంసాలు..కేసులతో గెలిచింది.. దేశంలోనే మోడల్ మున్సిపాలిటీగా కుప్పం !!
- చరిత్రలో నిలిచేలా అభివృద్ధి.. స్వర్ణాంధ్రసాధనకు సిఎం కృషి !!

**కుప్పం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**

కుప్పం మున్సిపాలిటీ ఛైర్మన్ స్థానం గెలుపు సిఎం చంద్రబాబు నాయుడుకు కానుకగా ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతడా॥ బిఆర్ సురేష్‌బాబు, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, టిటిడి బోర్డుసభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, పార్టీ అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్‌లతో కలిసి మాట్లాడారు. 2021 ఎన్నికల్లో వైఎస్సార్సీ కుప్పంలో విధ్వంస కార్యక్రమాలు చేయడంతో పాటు తమ పార్టీ వారిపై కేసులు, అధికారులతో కలిసి అనర్హత వేటు వేయడం, బైండోవర్లు చేయడం, చివరకు మహిళా నేతలపై లాఠీచార్జీలు చేయించారన్నారు. ప్రస్తుతం వైకాపాను వీడి తెదేపాకు మద్దతు



పలికిన కౌన్సిలర్లు కూడా తెదేపాలో ఉన్నవారేనని స్థానిక కారణాలతో వారు అప్పట్లో వైకాపాలో చేరారన్నారు. సిఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో మరలా పనిచేసేందుకు వాళ్లు ముందుకు వచ్చారన్నారు. 1200కోట్లరూపాయలతో కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి సింగపూర్ సంస్థతో ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే మున్సిపల్ పాలకవర్గంతో సిఎం సమావేశమై దిశానిర్దేశం చేస్తారన్నారు. కుప్పంలో అత్యధిక శాతం ఉన్న వన్నియకులక్షత్రియులకు ప్రాధాన్యత ఇవ్వాలని భావించి సిఎం చంద్రబాబు ఛైర్మన్‌గా సెల్వరాజ్‌కు అవకాశం కల్పించాలని నిర్ణయించారన్నారు. సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రతాప్, విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మహిళానేతలు అనసూయ, సుగుణమ్మ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## రేపటి నుంచి స్లాట్ బుకింగ్‌లో రిజిస్ట్రేషన్లు



**కుప్పం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**

ఈనెల 30వతేది నుంచి భూముల క్రయ,విక్రయాలు స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేయడం జరుగు తుందని కుప్పం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం స్లాట్ బుకింగ్‌పై దస్తావేజు లేఖరులకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. స్లాట్ బుక్ చేసుకున్న సమయానికి కొనుగోలు, విక్రయదదారులు హాజరు కావాలన్నారు. అలా రాకుంటే మరుసటి రోజు రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. స్లాట్ బుకింగ్ ద్వారా సమయం ఆదా కావడం జరుగుతుందన్నారు.స్ఎ వినోద్‌కుమార్, జెఎ భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌గా ఉదయ్ సంతోష్ బాధ్యతలు



**వి.కోట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**

వి.కోట మండల నూతన తహశీల్దార్‌గా ఉదయ్ సంతోష్ సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఈయన పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో ఇదివరకు అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేసేవారు. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న పార్వతిని బదిలీ చేస్తూ జిల్లా కలెక్టరేట్‌కు రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. నూతన తహశీల్దార్‌ను కార్యాలయ అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు.

## రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

**కుప్పంరూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



చెన్నై - బెంగళూరు రైలు మార్గంలో కుప్పం - మల్లానూరు రైల్వే స్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని మహిళ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతురాలి ఆచూకీ తెలిసిన వారు 900716436,9494228854నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## మొదలైన ఉచిత వేసవి శిక్షణ శిబిరం

**కుప్పంరూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



కుప్పం గ్రంథాలయ శాఖ అధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం కుప్పం ఉర్దూ హైస్కూల్‌లో ప్రారంభించారు. బాలికల హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోజువారి కార్యకలాపాలు పిల్లల తల్లిదండ్రులకు సూచించాలని తెలిపారు. గ్రంథాలయ అధికారిణి సత్యవాణి మాట్లాడుతూ పిల్లలకు వివిధ రకాల శిక్షణలు, పఠనంలో శిక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు. జూన్ 6వతేది వరకు ఈ శిబిరం కొనసాగుతుందన్నారు.

## ఇంట స్థలాలు మంజూరుకు చర్యలు

**గుడిపాల. ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రామభద్రాపురం పంచాయతీ హరిజనవాడ కాలనీ వాసులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, స్థానిక సర్పంచ్ హరిణి హేమాద్రినాయుడులు తహసిల్దారు జయంతిని కలిసి విన్నవించారు. గుడిపాల తహసిల్దారు కార్యాలయంలో సోమవారం తహసిల్దారు జయంతి ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కాలనీ వాసులతో కలిసి వచ్చిన మండల తెలుగుదేశం అధ్యక్షులు సుబ్రమణ్యంనాయుడు, సర్పంచ్ హరిణిలు కాలనీలో 28 కుటుంబాలకు సొంత స్థలం లేక ఇళ్ళ నిర్మాణాలు చేపట్టుకోకుండా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తహసిల్దారుకు వివరించారు. ప్రభుత్వం నుండి ఉత్తర్వులు అందిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని తహసిల్దారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు, మాజీ సర్పంచ్ పయణి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## విచారించి నిర్ధేశించిన గడువులోపు సమస్యలు పరిష్కారం



**చిత్తూరురూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను విచారించి నిర్ధేశించిన గడువులోపు చట్టపరంగా పరిష్కరించాలని ఎస్పీ మణికంఠ చందోలు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ మణికంఠ చందోలు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై మొత్తం 41 అర్జీలు అందాయి. ఇందులో చీటింగ్‌కు సంబంధించి 3, కుటుంబ తగాదాలు 8, వేధింపులు 6, ఇంటి తగాదాలు 1, భూ తగాదాలు 12, ఆర్థిక లావాదేవిలు 8, చిన్నపాటి గొడవలు 1, దారి సమస్యలు 1, ఆస్తి తగాదాలు 1 అందాయి.

## తమిళనాడు రేషన్ బియ్యం అక్రమ రవాణా

వ్యక్తి అరెస్టు

**సత్యవేడు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

సత్యవేడు మండలం శ్రీసిటీ పరిధిలో రాళ్ళకుప్పం గ్రామం వద్ద ఈ నెల 24 తేదీన శ్రీసిటీ పోలీసులు సీజ్ చేసిన తమిళనాడు రేషన్ బియ్యాన్ని సత్యవేడు తహసీల్దార్‌కు అప్పగించారు. సత్యవేడు మండలం శ్రీసిటీ పోలీసుల కథనం మేరకు ఈ నెల 24న ఆటోలో బుచ్చినాయుడు కండ్రిగకు చెందిన రుద్ర అనే వ్యక్తి తమిళనాడు రేషన్ బియ్యం 10 బస్తాలు తమిళనాడు నుంచి బుచ్చినాయుడు కండ్రిగకు అక్రమంగా తరలిస్తుండగా పక్కా సమాచారం అందుకున్న శ్రీసిటీ పోలీసులు సత్యవేడు మండలం రాళ్ళకుప్పం గ్రామం వద్ద ఆటోను స్వాధీనం చేసుకుని ఆటోను అందులో ఉన్న సుమారు 500 కేజీల తమిళనాడు రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసి సోమవారం స్థానిక తహసీల్దార్ రాజశేఖర్‌కు అందించారు.

## ఆగిన భారీ వాహనం.. స్తంభించిన ట్రాఫిక్

**చౌడేపల్లి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



భారీ వాహనం బస్టాండుకు సమీపంలో ఆగిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం వాటిల్లింది. స్థానిక బస్టాండుకు కూత వేటు దూరంలోగల ఆంజనేయస్వామి ఆలయం వద్ద తిరుపతి వైపు నుంచి ఇటాచీని తరలించుకొని వస్తున్న భారీ వాహనం మరమ్మతుకు లోనైంది. అసలే ఇరుకైన రోడ్డు ఆపై వాహనం నిలిచిపోవడంతో బస్టాండు నుంచి మోటారు వీధి వరకు పూర్తిగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వచ్చి వాహనదారులను అదుపు చేసి వాహనాలను మళ్ళించారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి బస్టాండులోని రోడ్డుకిరువైపులా వున్న ఆక్రమణలు తొలగించి, దశాబ్దాల తరబడి వున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## అంగన్‌వాడీలలో చిన్నారుల సమగ్రవికాశం :

**వెదురుకుప్పం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**



అంగన్‌వాడి కేంద్రాలలో చిన్నారుల సమగ్ర విద్యా మూర్తిమత్వ వికాశం జరుగుతుందని కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పద్మసునంద పేర్కొన్నారు. మండలంలోని వెదురుకుప్పం అంగవాడి కేంద్రంలోసోమవారంచిన్నారులకువార్షికోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక, సాంస్కృతిక,భావోద్వేగాల అభివృద్ధి పూర్తిస్థాయిలో సాధించడం జరుగుతుందన్నారు. చిన్నారులకు ఆటలు, పాటలతో వికాశం పెంపుదలకు కృషి జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్‌వైజర్ భారతి, కార్యకర్తలు జయసుధ, విజయకుమారి, అరుణకుమారి, నీరజ, చిరంజీవులు. విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నేత నిషిదరాజుకు సన్మానం

**వెదురుకుప్పం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :**



బిజెపి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి కుమార్ భారతీయ జనతా పార్టీ నేత నిషిద రోజు పుట్టి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె జన్మదిన వేడుకల్లో పాల్గొని సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. మంచి ఆరోగ్యంతో మరేన్నో జన్మదిన వేడుకలు జరుపుకుని విశేషంగా ప్రజా సేవలో పాల్గొన్నాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మాజీ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు విశ్వనాధ రెడ్డి పాల్గొన్నారు

## నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనాలు కల్పించడం హర్షనీయం

**తవణంపల్లె, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**



రాష్ట్రంలోని దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని వివిధ ఆలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం కనీస వేతనాలు ఏర్పాటు చేయడం హర్షనీయమని కేశఖండన జెఏసీ జిల్లా కన్వీనర్ నిరంజన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు ఈనెల 24 నుండి నెలకు 20 వేల నుండి 25 వేల రూపాయలకు వేతనం పెంచుతూ కూటమి ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేయడం హర్షనీయమన్నారు.

## కిశోరి బాలికలు చైతన్యవంతులు కావాలి

**తవణంపల్లె, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**



కిశోరి బాలికలు పలు విషయాల్లో చైతన్యవంతులు కావాలని ఐరాల ఐసీడీఎస్ సీడీపీఓ జి.నిర్మల అన్నారు. మండల కేంద్రం తవణంపల్లెలో లైన్ డిపార్ట్‌మెంట్, కిశోరి బాలికలకు మండలస్థాయి కిశోరి వికాసం వేసవి సెలవుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరి బాలికలు తమ హక్కులు గురించి తెలుసుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, రుతుక్రమ పరిశుభ్రత, లింగ సమానత,బాలల హక్కులు, రక్షణ, విద్యాకేరీర్, మార్గదర్శకత్వం, సైబం, ఆన్‌లైన్ భద్రత,ఆర్థిక నిర్వహణ,కౌమార బాలికల నాయకత్వం, శారీరక వ్యాయామం,బాల్య వివాహాలు వంటి పలు అంశాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.ఈకార్యక్రమంలో వెలుగు ఏపీఎం రవి, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదతరులు పాల్గొన్నారు.

## దళితుల సమస్యలు తీర్చండి

- ఏపీ రాష్ట్ర దళితుల సంక్షేమ సేవా సంఘం డిమాండ్

**పుంగనూరు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**



మండల పట్టణ పరిధిలో దళితుల సమస్యలు తక్షణం పరిష్కరించేందుకు అధికారులు చరణ్ చేపట్టాలని ఏపీ రాష్ట్ర దళితుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు శంకరప్ప డిమాండ్ చేశారు. సోమవారం బిఎమ్మెస్ క్లబ్ ఆవరణంలో నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశంలో వనమలదిన్ని గ్రామానికి చెందిన హనమప్పను జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. దళితులకు మండలంలో భూమి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వారి సాగు భూములను వారికే పట్టాయి ఇప్పించి. వన్ బి పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. దళిత సంఘంమానిటరింగ్ కమిటీకార్యదర్శి రాజా, దళిత సంఘం నాయకులు కుమార్, తూర్పు మొసాలు చంద్రన్న, బాలాజీ, కుమార్, గంగరాజు, లక్ష్మిపతి.ఎస్ నాగరాజ, కంగా నెల్లూరుకి చెందిన సీనప్ప, జనార్ధన, శివ, కృష్ణప్ప, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సీతమ్స్ కళాశాలలో ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

**చిత్తూరురూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**

చిత్తూరుపట్టణంలోని సీతమ్స్ కళాశాల నందు ఐదురోజుల పాటు ఏప్రిల్ 28నుంచి మే 2వ తేది వరకు మెకానికల్ విభాగం, జెఎన్‌టియుఏకు చెందిన ఫాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ ఆద్వర్యంలో కంప్యూటర్ అసిస్టెడ్ ఇంజనీరింగ్ గ్రాఫిక్స్‌కు సంబంధించిన ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇండస్ట్రీ, అకడమిక్ నిపుణులచే నిర్వహిస్తున్నట్లు సదస్సుకు వివిధ కళాశాలలకు చెందిన సీతమ్స్, వేము, ఎస్వీసెట్, విజయం, ఎస్వీసిఈ, అన్నమాచార్య, ఎస్ఆర్ఐటి, విశ్వం, కుప్పం ఇంజనీరింగ్ అధ్యాపకులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కాగా ఈ సదస్సు ఏర్పాటుకు శ్రమించిన జెఎన్‌టియుఏ ఫాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ ప్రొ. ప్రశాంతి, అకడమిక్ అడ్వైజర్ సీతమ్స్ డా. కె.ఎల్.నారాయణ, ఇతర అధ్యాపకులను కళాశాల వైస్‌ఛైర్మెన్ రంగనాథం, మేనేజింగ్ ట్రస్టీ డా.డి.ఏ కల్పజ, సెక్రటరీ డి.కె.బద్రీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్. వెంకటాచలపతి, డీన్ అకడమిక్స్ డా.ఎం.శరవణన్, డీన్ ఆర్అండ్ డి డా. సాంబశివరావు తదితరులను అభినందించారు. కాగా ఈ అవగాహన సదస్సును మెకానికల్ విభాగం అధిపతి డా.ఎన్.సతీష్‌కుమార్ ఇతర అధ్యాపకులచే విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## వితంతు ఫించన్లను అర్హులకు అందజేయండి



**చిత్తూరురూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం 2023 నుంచి 2024 మధ్యలో చనిపోయిన మగవారి భార్యలకు వితంతు ఫించన్లు మంజూరు చేయాలని నిర్ణయించిన ఆదేశానుసారం నగరపరిధిలోని డివిజన్లలో సచివాలయ సిబ్బంది ద్వారా ప్రత్యక్షంగా పర్యవేక్షించి అర్హులైన అందరికీ ఫించన్లు అందజేసేలా చర్యలు చేపట్టాలని సోమవారం ప్రజాగ్రీవెన్స్‌లో భారతీయ జనతా పార్టీ నాయకులు కమీషనరుకు వినతి చేసారు. అలాగే గిరింపేట, చామంతిపురం, శరవణపురం ప్రాంతాలకు సంబంధించి ఫారెస్టు సమీపంలోగల స్మశాన వాటికకు పార్థీవ దేహాన్ని వాహనంలో తీసుకువెళ్లడానికి మెరుగైన సౌకర్యాలు లేవని వినతి చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శి అట్లూరిశ్రీనివాసులు, మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ అశోక్, సీనియర్ నాయకులు ఎంజి రామభద్ర, మండల ప్రధాన కార్యదర్శి గోకుల్‌యాదవ్, మండల ఉపాధ్యక్షులుఈశాగణేష్,మండల కార్యదర్శి సతీష్. నాయకులు సత్య, వెంకటేశులు, రాజేష్ పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులు స్వయంగా స్థలానికి వెళ్లి పరిష్కరించే దశగా తాసిల్దార్

**పూతలపట్టు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**



మండలంలో ప్రజా ఫిర్యాదులు తానే స్వయంగా స్థలం వెళ్లి పరిష్కరించే దశగా తాసిల్దార్ రమేష్ బాబు తెలిపారు. నిత్యం పూతలపట్టు తాసిల్దార్ కార్యాలయానికి ప్రజలు క్యూ కడుతున్న అలసతత్వం వహించక పూతలపట్టు మండలంలోని ప్రతి సచివాలయం నుంచి వీఆర్వోలును మండల తాసిల్దార్ కేంద్రానికి మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తన కార్యాలయానికి రావాలని ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి వీఆర్వోలు ఇక్కడే ఉండాలన్నారు. తాసిల్దార్ కార్యాలయానికి వచ్చిన ఏ ఒక రైతును కూడా గంటల తరబడి బయట కూర్చొని పెట్టి కాలయాపన చేయకుండా వచ్చిన ప్రతి ఒక రైతుని తన దగ్గరకు తీసుకొని తన సమస్యని స్వయంగాతానే తాసిల్దార్ వారు విని ఎంత సమయమైనా ఆ రైతుకి కేటాయించి పూర్తిస్థాయిలో సమాచారాన్ని సేకరించుకుని పరిష్కార దిశగా ముందుకు వెళుతున్న తాసిల్దార్ సేవలు మండలంలోని ప్రజలు రైతులు మాకు సంతోషమని ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

## పహల్గామ్ ఉగ్రదాడి.. భద్రతావైఫల్యమా?

- టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆనగల్లు మునిరత్నం



***పూతలపట్టు, ఏప్రిల్ 28, ప్రభాతవార్త:*** పహల్గామ్ ఉగ్రదాడి భద్రతా వైపల్యమా అని టిడిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆనగల్లు మునిరత్నం అన్నారు. కళ్ల ముందు ఆర్మీ, ఇంటెలిజెన్స్ ఉన్నా పర్యాటకులపై పాశవిక దాడి ఎందుకు? కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలోని బైసరన్ గడ్డి మైదానంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి దేశాన్ని విషాదంలో ముంచింది. మతోన్మాదులతో కూడిన ఉగ్రవాదులు అత్యంత పాశవికంగా 26 మందిని హత్య చేశారు. వీరిలో ఇద్దరు విదేశీ పర్యాటకులు కూడా ఉన్నారు. గాయపడిన వారి సంఖ్య అధికమవుతున్నదీ, మరణాల సంఖ్య పెరిగే ప్రమాదం ఉంది. ఈ దాడిలో టూరిస్టుల పేర్లు అడిగి, ఇస్లాం మతానికి చెందని వారిని మాత్రమే టార్గెట్ చేసి, శాడిస్టిక్ మానసికతతో హత్య చేయడం మానవత్వాన్ని మంటగలిపిన ఘటనగా నిలిచింది. ఇలాంటి దాడులను ఇకనైనా అరికట్టాలి. భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలి. మత, ప్రాంతీయ ద్వేషాలను పెంచే విధానాలను తిరస్కరించాలన్నారు.



## అయూబ్ ఖాన్‌కు జాతీయ అవార్డు

**పుంగనూరు రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

పట్టణానికి చెందిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ పి అయుబ్ ఖాన్‌కు జాతీయ స్థాయిలో నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. ఈ అవార్డుతో పాటు అత్యున్నత పురస్కారం కూడా ను ఆయన సోమవారం న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్ లో జరిగిన 11 వ ఢిల్లీ రత్న అవార్డు వార్షికోత్సవంలో 37వ చీఫ్ జస్టిస్ బాలకృష్ణన్ చేతుల మీదుగా అందుకున్నారు.

## వృద్ధురాలు మెడలో నగ కాచేసిన మరో వృద్ధురాలు

**పుంగనూరు రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త**

పట్టణంలో ప్రతి సోమవారం జరిగే వారపు సంతలో పూజ సామాగ్రి కొనేందుకు వెళ్లిన సరోజమ్మ (60)కు గుర్తుతెలియని మహిళ మత్తు మందు చల్లి, మెడలోని 34 గ్రాముల బంగారు గొలుసు దొంగలించినట్లు బాధితురాలు వాపోయారు. మహిళ వెంటనే పుంగనూరు పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వేసవి శిక్షణా శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోండి



***చిత్తూరురూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:*** విద్యార్థిని, విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్రశిక్షణ అదనపు ప్రాజెక్టు డైరెక్టరు ఎం. వెంకటరమణ కోరారు. సోమవారం జిల్లా కేంద్రగ్రంధాలయం నందు వేసవిశిక్షణా శిబిరంను జ్యోతి ప్రజ్వలనతో ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో స్పోకన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, క్యారంబోర్డు, కథలు చెప్పడం, కథలు వినడం, జికె. క్విజ్, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ అనంతరం పాల్గొన్న విద్యార్థులందరికీ మెమెంటో, సర్టిఫికేట్స్‌ను విజయం కళాశాల తరపున ప్రదానం చేయడం జరుగుతుందనీ సూచించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, మండల విద్యాశాఖాధికారి మోహన్, విజయం విద్యాసంస్థల ఏఓ రాజగోపాల్‌రావు, జనవిజ్ఞాన వేదిక మాజీ కోఆర్డినేటర్ రంగనాధన్, డిప్యూటీ లైబ్రేరియన్ లలిత, గజేంద్రబాబు, పూర్ణిమ, మునీంద్ర, గుణ, సుల్తానా భాను, తులసీకుమార్, రాజశేఖర్, దేవిబాల,సరస్వతి, లవకుమార్, ఎల్లమ్మ,భాష తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద దాడిలో మృతుల ఆత్మశాంతికి కొవ్వొత్తులతో నిరసన

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన వారి ఆత్మశాంతికోసం జైభీం ప్రజా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. జైభీం ప్రజా సంరక్షణ సమితి అధ్యక్షులు షేక్.కరీముల్లా సారధ్యంలో కొవ్వొత్తుల వెలుగులతో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జానుల్లావీధిలో జైభీం ప్రజా సంరక్షణ సమితి సభ్యులతో కలసి ముగ్దాబాద్ పాకిస్తాన్ టెర్రరిజం మర్దాబాద్ హిందూ ముస్లిం జిందాబాద్ హిందూ ముస్లిం జిందాబాద్ హిందూ ముస్లిం ఏక్థ జిందాబాద్ అనే నినాదాలతో పాకిస్తాన్ జెండాను చింపుతూ ర్యాలీ చేసి మరణించిన వారి ఆత్మశాంతి కలగాలని కొవ్వొత్తుల నివాళులుఅర్పించారు. ఈసందర్భంగా పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నదని చెప్పారు. పహల్గాంలో అమాయకులు అయిన హిందువులపై కాల్పులు చేయడం అత్యంత దారుణమని తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ లతీఫ్, బాబు, మస్తాన్, ఆర్టీసి జానీబాషా, షేక్‌కరీముల్లా, పండ్ల వ్యాపారులు రియాజ్, అన్వార్, ఎండి.రఫి, వెంకటేష్, సోముప్రదీప్ సనీబుల్లా రామచంద్రాపురం కరీముల్లా, నిజాముద్దీన్, షమీర్, ఫయాజ్ బాబు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

## టుటౌన్ సిఐగా నాగార్జునరెడ్డి



**తొట్టంబేడు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐగా గతంలో అర్బన్ సిఐగా పనిచేసిన డి.నాగార్జునరెడ్డిని విఆర్‌లో ఉన్న నాగార్జునరెడ్డిని నియమిస్తూ జిల్లా ఎస్పి ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఈయనకు శ్రీకాళహస్తి అర్బన్‌లో సమర్ధవంతంగా పనిచేసిన అనుభవం ఉంది. ఇక్కడ సిఐగా పనిచేస్తున్న వెంకటేశులను విఆర్‌కు పంపారు. ఈసంద ర్భంగా సోమవారం సిఐగా బాధ్యతలు స్వీకరించిన నాగార్జునరెడ్డి మాట్లాడుతూ టుటౌన్ పరిధిలో ఉన్న శాంతిభద్రతలను పరిరక్షించడానికి తన వంతు కృషిచేస్తానని సిబ్బంది సాయంతో ముందుకెళ్తామన్నారు.

## బాధ్యతాయుతంగా ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి

-తిరుపతిరూరల్ ఎంపిపి మూలం చంద్రమోహన్‌రెడ్డి

**తిరుపతిరూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండల ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికారులు బాధ్యతాయుతంగా సహకారం అందించాలని తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు మూలం చంద్రమోహన్‌రెడ్డి కోరారు. సోమవారం ఎంపిపి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎంపిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్జీలు స్వీకరించిన అనంతరం ఎంపిపి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పేరూరు గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని, హౌసింగ్ సంబందించిన అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సి,మల్లవరం గ్రామ పంచాయతీకి బోరు మోటరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ మొక్కలభారతి ఎంపిపి చంద్రమోహన్‌రెడ్డిని కలిసి, వినతి పత్రం అందజేసారు. వర్షాభావ పరిస్థితులలో నీటి ఎద్దడి ఎక్కువుగా ఉందని, తక్షణమే బోరు మోటరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు విడుదల మాధవరెడ్డి, యశోధ, ఎంపిడిఓ రామచంద్ర, హౌసింగ్ డిఇ శ్రీరాములురెడ్డి, వైకాపా సీనియర్ నేత మొక్కల తిమ్మారెడ్డి, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే నాని

**తిరుపతిరూరల్, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండల అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులతో సమీక్షించారు. సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. పేరూరు స్మశానంలో ఎన్ఆర్‌సిఎస్ నిధులతో చెట్ల పెంపకం చేపట్టాలని ఎంపిఓకు సూచించారు. అలాగే తిరుచానూరు మార్కెట్ యార్డు రోడ్డు విస్తరణ చేపట్టాలని సూచించారు. అవిలాల దగ్గర ఉన్న సంపు సద్వినియోగానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, ఎంపిడిఓ రామచంద్ర, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ హిమంత్‌కుమార్, శ్రీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చియ్యవరంలో భూవివాదాలు-తూతూ మంత్రంగా అధికారుల విచారణ

**తొట్టంబేడు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**

మండలంలోని చియ్యవరం గ్రామంలో భూవివాదాలు జఠిలమవుతున్నాయి. గ్రామంలో 2003 సంవత్సరంలో సర్వేనంబర్ 356-3లో ప్రభుత్వ భూమి 1.40సెంట్లు గ్రామానికి చెందిన కె.భువనేశ్వరికి ఇచ్చారు. ప్రస్తుతం ఆమె భర్త కె.చలపతి ఇటీవల మృతిచెందాడు. తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమి కరెక్ట్‌గా ఉందని అయితే 22 సంవత్సరాలుగా సాగుబడిలో ఉన్న భూమి ప్రస్తుతం తమ కింద భూమి పట్టా ఇచ్చిన వారికి భూమి తగ్గిందని అయితే ఇందులో తన భూమిని వదలాలని తహశీల్దార్, ఆర్డీవో చెప్పారని భువనేశ్వరి వివరించారు. తనపై భూమి పట్టా తీసుకొన్న వారికి భూమి ఎక్కువగా ఉన్నా వారు తన భూమిని వదలడం లేదు. తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని వారికి వివాహాలు జరిపించానని తెలిజేసింది. సోమవారం ఉదయం 5గంటల సమయంలో తాను ఇంటిమిద్దెపైన నిద్రపోతుండగా మా ఇంటికి వచ్చి తన భూమి కింద వారు కె.నర్సమ్మ, పి.వెంకటమునిలు వచ్చి తనను బెదిరించి భయబ్రాంతులకు గురిచేశారని భువనేశ్వరి ఆవేదన వ్యక్తం చేసింది.తనకు రక్షణ రక్షణ కల్పించాల్సిందిగా తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐకు పిర్యాదు చేసింది. అయితే చియ్యవరం గ్రామంలో వివాదాలను పరిష్కరించాల్సిన అధికారులే మెలికలు పెడుతుండడం గమనించదగ్గ విషయం.

## బృందమ్మకాలనీలో పల్లెనిద్ర

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త**



తిరుపతి జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు అర్బన్ స్టేషన్ పరిధిలో ఉన్న బృందమ్మ కాలనీలో పల్లెనిద్ర కార్యక్రమం సిఐ డి.గోపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా అక్కడి ప్రాంత ప్రజలతో మాటామంతి కార్యక్రమం నిర్వహించి కాలనీ వాసుల సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. మరియు పోలీసుల యొక్క సేవలను వారికి మరింత చేరువచ్చే విధంగా కొత్తగా ఏర్పడిన చట్టాల గురించి సైబర్ క్రైమ్స్, చిన్న పిల్లలు మరియు మహిళల పట్ల జరిగే నేరాలు గురించి వారికి అవగాహన కల్పించడం జరిగింది. కాలనీలో చదువుకుంటున్న చిన్నారులకు పుస్తకాలు, మరియు వారికి కావాల్సిన విద్యాసామగ్రిని అందించారు. కాలనీలో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిఐతో పాటు పోలీసు సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## బాగా చదువుకుంటే భవిష్యత్తు బంగారు మయం

### ర్యాంకులు సాధించిన విద్యార్థుల్ని సత్కరించిన ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త



మనిషి జీవితంలో విద్యార్థి దశ కీలకమైనదని ముఖ్యంగా పదవ తరగతి ఇంటర్ దశ మరీ కీలకమని ఈ దశలో విద్యార్థులుతమ భవిష్యత్తును తీర్చి దిద్దుకునే దశ అని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తిలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో సోమవారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి రూరల్, అర్బన్, తొట్టంబేడు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారిని తీర్చి దిద్దిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ఆధ్యాత్మికంగానే కాకుండా విద్యాపరంగా కూడా మొదటి స్థానం సాధించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యువ నాయకుడు నారాలోకేష్ విద్యామంత్రిగా ఎన్నో సంస్కరణలతో పాటు నిరుపేదల విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.

**అవార్డులు అందుకున్న విద్యార్థులు వీరే:**

సోమవారం ప్రభుత్వ బడుల్లో ర్యాంకులు సాధించిన వారిని సత్కరించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీలోని బాబూ అగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏ కేతన్ 589 మార్కులు సాధించి నెంబర్ 1 వ స్థానంలో నిలిచారు.ఆ తనిని సత్కరించారు. అలాగే శ్రీకాళహస్తి బాలుర ఉన్నత పాఠశాలలో పి.తనిష్ రాజ్ మోసస్ 584 మార్కులు సాధించి రెండవ స్థానం సాధించి ఎంఎల్ఏ ద్వారా అవార్డు అందుకున్నారు. స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కు చెందిన ఎం.కీర్తనాబాయ్ 583 మార్కులతో మూడవ స్థానం సాధించినందుకు ఆ బాలికను సత్కరించారు. తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలి పాఠశాలకు చెందిన ఎల్ జ్యోతీశ్వర్ 582 మార్కులతో మండలం టాపర్ కాగా ఆతనిని సత్కరించారు.అ దే పాఠశాలలో పి.పూజిత 559 మార్కులతో ద్వితీయ స్థానం సాధించినందుకు సత్కరించారు.బోనుపల్లికి చెందిన పి.యువరాజు 550 మార్కులు సాధించి మూడవ స్థానం సాధించినందుకు ఎం.ఎలనప సత్కరించారు. అదే పాఠశాలకు చెందిన వైలెనిన్ 550మార్కులు సాధించారు కాబట్టి ఆతన్ని కూడా సత్కరించారు.ఏర్పేడు మండలంలోని కందాడు పాఠశాలకు చెందిన ఏ.రేష్మ 569మార్కులతో మండల మొదటి స్థానం సాధించినందుకు ఎంఎల్ఏ ఆ విద్యార్థిని సత్కరించారు. మునగలపాళెం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన టి.సుహాసిని 566 మార్కులతో ద్వితీయ స్థానం సాధించినందుకు సత్కరించారు. ఏర్పేడుకు చెందిన ఎం.యమున 566 మార్కులతో మూడవ స్థానం సాధించినందుకు ఎంఎల్ఏ సత్కరించారు.రేణిగుంట మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన బి.మాదవి 573 మార్కులతో మండలం ఫస్ట్ కావటంతో సత్కరించారు. బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇ. రుషీశ్వర్ 572 మార్కులతో మండలం ద్వితీయ స్థానం సాధించారు. మరో బాలిక బి.తేజస్విని 570 మార్కులతో తృతీయ స్థానం సాధించినందుకు ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి సత్కరించారు.సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి,ఎంఇఓలు భువనేశ్వరి,బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అక్షయతృతీయవేళ సొనాటా గోల్డ్



తిరుపతి,ఏప్రిల్ 28ప్రభాతవార్త:

దేశంలో అత్యధికంగా ప్రజలు ఆదరించే సొనాటో అద్భుతమైన అక్షయతృతీయ ఆఫర్‌గా గోల్డ్ కలెక్షన్‌ను పరిచయం చేసింది. బంగారాన్ని ఆస్వాదించే తిరిగి ఊహించుకునే ఆకర్షణీయమైన ఆలోచనాత్మక కలెక్షన్‌అని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. సాంప్రదాయంగా కూడా సొనాటా పేరెన్నికైంది. అక్షయతృతీయ సమీపిస్తున్న సమయంలో వాచ్‌లోని డయల్‌లో 22రె తనిష్కగోల్డ్‌కాయిన్‌ను కలిగి ఉందన్నారు. ఇది ఒక అనుభవమని బ్రాండ్ హెడ్ ప్రతీక్‌గుప్త తెలిపారు. ఆధీకృత రీటైలర్లు, ఇ కామర్స్‌లోఅందుబాటులో ఉంది.

## ప్రభుత్వ బడులలో విద్యార్థులను చేర్పించండి

### -ప్రధానోపాధ్యాయులు భూపతిరెడ్డి కరపత్రాల పంపిణీ

రామచంద్రాపురం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :



ప్రభుత్వ బడులలో విద్యార్థులను చేర్పించాలంటూ రాయలచెరువు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూపతిరెడ్డి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులతో కలిసి మండలంలో అన్ని గ్రామాల్లో సుడిగాలి పర్యటలను నిర్వహించారు. ప్రధానంగా మండలంలో మొదట దఫాలో రాయలచెరువు, ఒడ్డుకాలువ, చిట్టత్తూరు గ్రామాలలో తిరిగి విద్యార్థులను తమ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు, విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాయలచెరువు సర్పంచ్ మురుగయ్య, ఉపాధ్యాయులు మైథిలి, లోకేశ్వరి, కృష్ణవేణి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత నాణ్యతాప్రమాణాలతో "మహాప్రస్థానం"

### పనుల పురోగతిపై ఎంఎల్ఏ పులివర్తి నాని సమీక్ష

చంద్రగిరి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



చారిత్రాత్మక చంద్రగిరిలో మహాప్రస్థానం (గోవింద ధామం) నిర్మాణ పనులు అత్యంత నాణ్యతా ప్రమాణాలతో చేయాలని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్వర్ణముఖీనదీ తీరాన ఆధునిక హంగులతో శరవేగంగా సాగుతున్న మహాప్రస్థానం నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించి, కమిటీతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల నాణ్యత విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. దాతల నుండి తీసుకుంటున్న విరాళాలకు సంబంధించిన నిధుల వ్యయంపై పారదర్శకత పాటిస్తూ అన్ని ఖర్చులను నమోదు చేయాలన్నారు. అవసరమైతే దాతలు ఏవైనా వివరాలను కోరితే తెలియజేయాల్సి వుంటుందన్నారు. నిర్మాణ పనుల్లో ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఈ క్రమంలో కమిటీకి, అధికారులకు, కార్మికులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఈ మురళి, కమిటీ అధ్యక్షుడు వీరంగారి రమేష్ రెడ్డి, కార్యదర్శి నాగరాజ నాయుడు, మార్కెట్‌యార్డు చైర్మన్ గౌసభాషా, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, తెలుగుయువత మండల అధ్యక్షుడు రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, టిడిపి నాయకుడు శుభగిరి నాయుడు, బాలసుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ శాఖ ఆదేశిస్తే పాకిస్తాన్‌తో యుద్ధానికి సిద్ధం

### - మాజీ సైనికుల సంఘం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 28, ప్రభాతవార్త



కేంద్ర ఆదేశిస్తే పుంగనూరు మాజీ సైనికులు సంఘం సంసిద్ధత వ్యక్తం చేసింది. సోమవారం రాత్రి ప్రహల్గావ్ ఘటనకు నిరసనగా వారు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు విశ్రాంతి డిఎస్పి సుకుమార్ బాబు మాట్లాడుతూ రంగంలోకి దూకేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఎన్టీఆర్ సర్కిల్. నుంచి ముడప్ప సర్కిల్ వరకు మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో పహాల్గంలో ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను అంత మోదించాలన్నారు. రక్షణ శాఖ ఆదేశిస్తే పాకిస్తాన్ తో యుద్ధానికి మాజీ సైనికుల సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు రెడ్డప్ప, ఉపాధ్యక్షులు జవహర్, కార్యదర్శి ప్రతాప్ కుమారు, సభ్యులు నానాబాల సుబ్రమణ్యం, నాన బాల గణేష్, మిలటరీ చిన్న తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలకు పక్కాగా పరిష్కారం

### - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్‌కుమార్

పలమనేరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పక్కాగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పలమనేరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం పలమనేరు మున్సిపాల్టీ, మండలం, పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో వున్న ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ స్థానిక ఎమ్మెల్యే ఎన్.అమరనాథరెడ్డితో కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు వితంతువులు, వృద్ధులు తమకు పెన్షన్ రావడం లేదని పరిశీలించి మంజూరు చేయాలని కలెక్టర్‌ను విన్నవించుకున్నారు. అలాగే రెవెన్యూ పరంగా భూముల సమస్యలను సరిగ్గా పరిష్కారం కావడం లేదని క్షేత్ర స్థాయిలో పరిశీలించి తమకు న్యాయం చేయాలని కొంతమంది బాధితులు కలెక్టర్‌ను కోరారు. అలాగే ఇళ్ళ నిర్మాణాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంకు పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో నుండి 90 మంది ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారులకు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్రపాడల్, పలమనేరు ఆర్డీఓ భవానీ, జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా పిడి రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు, డిఆర్‌డిఏ పిడి శ్రీదేవి, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ, ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఇస్మాయిల్, సర్వే ఎడి జయరాజ్, ఆర్‌డబ్ల్యు ఎస్ ఇఇ నరేంద్రకుమార్, డిఎల్‌డిఎ రవికుమార్, కలెక్టరేట్ ఎఓ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లివెట్టు హై స్కూలు పదవ ఫలితాల కరపత్రాలతో ప్రచారం

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విలువలతో గుణాత్మక విద్యను అందిస్తున్నామని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్, ఉపాధ్యాయ బృందం పదవ ఫలితాల కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. సోమవారం ఇటీవల విడుదలైన పదో వరగతిలో ఉత్తీర్ణతసాధించిన విద్యార్థిని, విద్యార్థుల ఫోటో, మార్కులతో కరపత్రాలు ప్రచురించి వారి పాఠశాల పరిధిలోని తలారివెట్టు గిరిజన కాలనీని ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్‌బాబులు కలసి 6వ తరగతిలో విద్యార్థులు కొరకు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచేలా బోధనసాగుతున్నట్లు తెలిపారు. తల్లికి వందనం ద్వారా ప్రతివిద్యార్థికి రూ.15 వేలు నగదు, మధ్యాహ్న భోజనం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర ద్వారా 3 జతల యూనిఫాం, స్కూలు బ్యాగు, షూస్, సాక్స్, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బెల్టు ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యువశ్రీ మురళి, సురేష్ బాబు పాల్గొన్నారు.

## నోటీసులు వెనక్కి తీసుకోవాలంటూ ధర్నా

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:

ఇంటి స్థలాల కోసం పోరాటం చేస్తున్న కనమనంబేడు దళితులకు పంపించిన నోటీసులను వెనక్కి తీసుకోవాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు చిన్నిరాజ, కత్తి ధర్మయ్య మాట్లాడుతూ ఇంటి స్థలాల కోసం కనమనంబేడు దళితులు 39 రోజులు నిరాహారదీక్ష కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు ఇంటి స్థలాల కోసం పోరాటం చేస్తున్న దళితులకు నోటీసులు పంపడం ఎంత వరకు సమంజసం అని పేర్కొన్నారు. దళితులకు పంపించిన నోటీసులు వెనక్కి తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఎస్ఐ విశ్వనాథనాయుడు, తహసీల్దార్ కార్యాలయం చేరుకుని సీపీఐ నాయకులు దళితులతో కలసి తహసీల్దార్ శ్రీదేవిని సంప్రదించి సమస్యను చర్చించి పరిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిన్నిరాజు, కత్తి ధర్మయ్య, దళితులు పాల్గొన్నారు.

## కల్లివెట్టులో ఇంటి స్థలాల ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి

బుచ్చినాయుడు కండ్రిగ, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



కల్లివెట్టు గ్రామంలో ఇంటి స్థలాల ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కత్తి ధర్మయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీదేవికి కల్లివెట్టు గ్రామంలోని బీసీ కులస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతప్రభుత్వ పాలనలో పక్కా గృహాల నిర్మాణం కొరకు సర్వే నెం.239/1లో ఒకటిన్నర సెంటు ప్రకారం ఇంటిస్థలాల కేటాయించి పట్టాలు మంజూరు చేయడం జరిగిందని, ఇదే గ్రామానికి చెందిన కొందరు ఇంటి స్థలాలు అక్రమాలకు పాల్పడుతూ దుష్ప్రాచార పడుతున్నారని అక్రమదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## 30లోపు వితంతు వృద్ధాప్య పెన్షన్లకు వివరాలు సమర్పించాలి

కేవీబీ పురం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య పెన్షన్‌కోల్పోయిన వారు అర్హులుగా పెన్షన్ పొందుటకు ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని ఎంపీడీవో రాధారాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వితంతు వృద్ధాప్య పెన్షన్లకు సచివాలయంలో ఈ నెల 30 తేదీ లోపు వివరాలు సమర్పించాలన్నారు. ఏప్రిల్ 25 నుంచి సచివాలయంలో ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. పెన్షన్ కోల్పోయిన వారు అర్హులుగా ఉన్న నేపథ్యంలో అర్హురాలైన మహిళలు భర్త మరణ ధృవీకరణ పత్రంతోపాటు వారి యొక్క ఆధార్‌కార్డు, ఇతర వివరాలు గ్రామ వార్డు సచివాలయాల్లో అందించాలన్నారు. జూన్ నుంచి పింఛన్ సొమ్ము అందుతుందని వెల్లడించారు. అదే విధంగా ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరైన నేపథ్యంలో(32 యూనిట్లు) మండలంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 21 నుంచి 50 సంవత్సరాల లోపు వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించి వివరాలు పూర్తిగా తెలుసుకోవాలని ఎంపీడీవో కోరారు.

## మూడు సిలిండర్లు చోరి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త

బతుకు జీవనం కోసం తోపుడు బండ్లు రోడ్డుపక్కన అల్పాహార దుకాణాలు నిర్వహించుకుంటున్న నిరుపేదలకు సంబంధించిన గ్యాస్ సిలిండర్లను దొంగలు ఎత్తుకెళ్ళినట్లు చిరువ్యాపారులు లబోదిబో అంటున్నారు. శ్రీకాళహస్తిలోని తేరువీధి శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధికి వెళ్ళు దారి ఈ దారిలో వ్యాపారాలు వారంలో మూడు రోజులు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో బడా హోటళ్ళు ఉన్నాయి.అయితే దీటుగా ఇటీవల రోడ్డు పక్కన దుకాణాలు వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సిలిండర్లను దాచి పెట్టి పోయిన వ్యాపారులు సోమవారం ఉదయం వ్యాపారానికి రాగా సిలిండర్లు మాయమయ్యాయి. తేరువీధిలోని రాజగోపురం ఎదురుగా ఓ తోపుడు బండిలోనూ, అలాగే ఎదురుగా చెన్నైశరవణ హోటల్ ఎదురుగా అల్పాహారం విక్రయిస్తున్న వారికి సంబంధించినవి ఒరెండు సిలిండర్లు దొంగలుఎత్తుకు వెళ్ళినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా సిసి కెమెరాలు పరిశీలిస్తామని భరోసా ఇచ్చారు.పట్టపగలు ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతంలో సిలిండర్ల చోరీతో వ్యాపారులు భయభ్రాంతులౌతున్నారు.

## ఆర్టీసీలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించండి

### - రిలే నిరాహారదీక్షలో ఎన్ఎంయూ

సత్యవేడు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



ఆర్టీసీ ఉద్యోగులకు గత నాలుగు సంవత్సరాలుగా ఆగిన పదోన్నతులను వెంటనే కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ అధ్యక్షుడు పెరుమాళ్ డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సత్యవేడు డిపో ప్రాంగణంలో పలువురు ఎన్ఎంయూ ఉద్యోగులు రిలే నిరాహారదీక్ష చేశారు. రీజనల్ అధ్యక్షుడు ఎస్.జె.పెరుమాళ్ మాట్లాడుతూ ఉద్యోగుల ఉద్యోగ భద్రత కోసం 1/2019 సర్క్యులర్ అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలన్నారు. అంతకు ముందు ఎన్ఎంయూ రీజనల్ అధ్యక్షుడు పెరుమాళ్ ఆధ్వర్యంలో డిపో అధ్యక్షుడు పార్థసారథిరెడ్డి, వాసుదేవయ్య, గోపాల్, పోలయ్య, విజయన్, గజేంద్రన్, బాలాజీ తదితరులకు ఉద్యోగులు పూలమాలలు వేయడంతో రిలే నిరాహారదీక్షకు కూర్చుకున్నారు. కార్యక్రమంలో గ్యారేజీ అధ్యక్షుడు కుప్పయ్య, సుధాకర్, కుమార్, గోపన్న, ఆనందయ్య, ప్రకాష్, వర్మ, కరీంముల్లా, వాసులు, వినోద్‌కుమార్, వేణు, పాపయ్య తదితరులు సంఘీభావంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మాజీ మంత్రి రోజాను కలసిన మండల వైసీపీ నాయకులు

విజయపురం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



మాజీ మంత్రి రోజాను నగరిలో ఆమె స్వగృహంలో సోమవారం వైసీపీ పార్టీలో కొత్తగా వివిధ పదవులు పొందిన మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ మరల వైసీపీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్కరు కష్టపడాలని వారిని కోరారు. ఆమెను కలసిన వారిలో వైసీపీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శేఖర్‌రాజు, మండల అధ్యక్షుడు శివరాజు, ఉపాధ్యక్షుడు సతీష్ యాదవ్, నాయకులు గోపిరాజు, సుబ్బుయాదవ్ తదితరులు ఉన్నారు.

## చర్యాత్మక పరిశోధనకు డైట్ ప్రిన్సిపల్ అభినందనలు

తొట్టంబేడు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త



కార్వేటినగరంలోని డైట్ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో మూడు విడతలుగా జరిగిన చర్యాత్మక పరిశోధనకు బిఎన్‌కండ్రిగ మండలం, పుత్తేరి పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత గుమ్మడి మురళీ ప్రవేశం పొంది' ఏ స్టడీ ఆన్ ఫంక్షనింగ్ ఆఫ్ స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్స్ అట్ ప్రైమరీ లెవల్, ఇంపాక్ట్ ఏయ టీచర్స్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్' అనే విషయంమీద డైట్ లెక్చరల్ దేవప్రసాద్ సలహాతో పరిశోధన చేయడం జరిగింది. మారుతున్న కాలనికి అనుగుణంగా అకడమిక్ పరంగా ఉపాధ్యాయులకు జరిగే సిఆర్‌సి లెవల్ శిక్షణ సమావేశాలు మీద మూడు మండలాల్లో 30మంది ఉపాధ్యాయులు అభిప్రాయాలతో సమగ్ర సర్వే చేసి పరిశోధన చేయడం జరిగింది. తన పరిశోధనను డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.శేఖర్ పరిశీలించి అభినందించడంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందించారు. ఈపరిశోధనతో మరింత బాధ్యత పెరిగిందని విద్యార్థులకు సరికొత్త అధ్యయనాలతో విద్యాబోధన చేస్తానని మురళీ తెలిపారు.

# తిరుపతి డివిజన్

## గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం

తిరుపతి విద్య ఏప్రిల్ 28 ప్రభాత వార్త



స్థానిక అన్నయ్య సర్కిల్ నందలి గ్రేడ్ 1 గ్రంథాలయాధికారి జె.శివ ప్రసాద్ అధ్యర్యంలో ఉచిత వేసవి విజ్ఞాన తరగతులకు కె.బాలాజీ, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్,తిరుపతి వారు ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ చినిగిన చొక్కా అయిన తొడుక్కో,మంచి పుస్తకం కొన్నుక్కో అన్న కందుకూరి వీరేశలింగం చెప్పిన మాటలు గుర్తుచేశారు.ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచే సమయ పాలన అలవాటు చేసుకోవాలని,ప్రతిరోజు కనీసం ఒక్క గంటైన గ్రంథాలయానికి వచ్చి పుస్తకపఠనం అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయశాఖ వారు హైస్కూల్ విద్యార్థిని, విధ్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు మరియు వారిలో సృజనాత్మకతను పెంచే కృషిలో భాగంగా ఈ ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారని అందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.నడ్డి నారాయణ ఇంపాక్ట్ ట్రైనర్ మాట్లాడుతూ పుస్తకం నన్ను తలవంచి చూడు,నిన్ను తల ఎత్తుకునేల చేస్తాను అంటుంది అన్నారు. తహసున్నస బేగం,ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్,ఇంపాక్ట్ ట్రైనర్ మాట్లాడుతూ కాలమే దైవంగా భావించి ఈ వేసవి సెలవులను నైపుణ్యం పెంచుకోవడానికి ఉచిత వేసవి శిక్షణా తరగతులలో పాల్గొని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో డా. గోపాల్ రిటైర్డ్ ఎ ఓ, ఎస్వీయూ తిరుపతి, సోము ఉమాపతి ప్రముఖ గాయకుడు, డా. సి. స్వరాజ్య లక్ష్మీ రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎస్వీ డిగ్రీ, పీజీ కాలేజీవై. వెంకట నారాయణ రిటైర్డ్ జనరల్ మేనేజర్ బి ఎస్ ఎన్ ఎల్ తిరుపతి, పి.గోవిందు గ్రంథాలయ సిబ్బంది హై స్కూల్ విద్యార్థిని,విధ్యార్థులు పాల్గొన్నారు.

## అనధికార భవన నిర్మాణాలపై నోటీసులు జారీ

నారాయణవనం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :

నారాయణవనం మేజర్ పంచాయతీలో అనాధికారికంగా తాతా సొరకాయులస్వామి ఆలయం పేరుతో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలపై కొద్దిరోజుల క్రితం వచ్చిన సమాచారహక్కుచట్టం ఫిర్యాదు మేరకు సోమవారం ఇఓపిఆర్‌డి డాక్టర్ వేణయ్య, పంచాయతీ కార్యనిర్వాహణాధికారి కెపి షణ్ముగంలు నోటీసులు జారీ చేశారు. నోటీసులో మూడు అంతస్తుల భవనంతో పాటు కాంప్లేస్‌లు నిర్మిణానికి ఎవరు అనుమతి ఇచ్చారో తెలపాలని కోరారు. వారం రోజుల్లో నోటీసుకు సమాధానం ఇవ్వాలని కోరారు. నోటసును ఆలయ తాత్కాలిక నిర్వాహకులు టిపి దొరైరాజ్ స్వీకరించారు. నారాయణవనంలో టిటిడి కల్యాణ మండపం పక్కన కొత్తగా కట్టిన కల్యాణ మండపంను రెండస్తులతో నిర్మించారు. అలాగే ఎదరుగా వున్న రూములు, కల్యాణ మండపం ఎదురుగా వున్న కాంప్లేస్‌ను ఇందులో చూపించడం లేదు. తుడా, పంచాయతీ అనుమతి లేకుండా నిర్మించారో వాటికి కూడా నోటీసులు అందించాలని స్థానికులు డిమాండ్ చేశారు.

## సత్యవేడు సబ్ రిజిస్టర్‌పై ఆర్డీఓకి ఫిర్యాదు

నారాయణవనం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :



సత్యవేడు సబ్‌రిజిస్టర్‌పై సత్యవేడు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి నేత బాలగురవం బాబు సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయికి సోమవారం ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ సత్యవేడు సబ్ రిజిస్టర్ చట్టాన్ని అతిక్రమించి కొన్ని భూములను రిజిస్ట్రేషన్ చేయడం దారుణమైన చర్యగా పేర్కొన్నారు. నోటిఫికేషన్‌లో ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయడం చట్టానికి విరుద్ధమన్నారు. తిరుపతి జిల్లాలోని చాలా రెవెన్యూ కార్యాలయాలు అవినీతికి కేరఫ్ అడ్రస్‌గా మారిపోతున్నట్టు గుర్తు చేశారు. వెంటనే జిల్లా ఉన్నత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

## 30 నుంచి సముదాయం అగస్తీశ్వరుని బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త :

మండలంలోని సముదాయం గ్రామంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30వతేది బుధవారం నుంచి ప్రారంభం అవుతుందని ఆలయ పర్యవేక్షకులు నాగరాజు తెలిపారు. 30వ తేది బుధవారం సాయంత్రం 6గంటల నుంచి గణపతిపూజ, రాత్రి అంకురార్పణ నిర్వహించడం జరుగుతుందని, మే 1వతేది గురువారం ఉదయం వృషభలగ్నంలో ధ్వజారోహణం, రాత్రి చంద్రప్రభవాహనం, 2న రాత్రి సింహవాహనం, 3న హంసవాహనం, 4న శేషవాహనం, 5న నందివాహనం, 6న గజవాహనం, 7న రథోత్సవం, 8న సాయంత్రం 6గంటలకు కల్యాణోత్సవం, రాత్రి 8.30గంటలకు అశ్వవాహనం, 9న ఉదయం 9గంటలకు నటరాజావాహనం, రాత్రి రావణేశ్వరవాహనం, 10న ఉదయం త్రిసూలస్నానం, రాత్రి ధ్వజఅవరోహనంతో ఉత్సవాలు ముగుస్తుంది. కల్యాణోత్సవంలో పాల్గొనే వారు 500 రూపాయాలు చెల్లించాలన్నారు.

## నేటి నుంచి అటానమస్ కళాశాలల్లో డిగ్రీ పరీక్షలు

తిరుపతి విద్య ఏప్రిల్ 28 ప్రభాత వార్త

గత ఏడాది అటానమస్ హోదా పొందిన టీటీడీ కళాశాలలో సోమవారం నుంచి డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల,ఎస్ఎస్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాళ్ల పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 3 వేల మంది విద్యార్థులు అటానమస్ హోదాలో డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు హాజరుకానున్నారు.ఈ పరీక్షలు వచ్చేనెల 6వ తేదీవరకు కొనసాగనున్నాయి.

## ఈత రాని విద్యార్థి బావిలోకి దూకి గల్లంతు

### చంద్రగిరి బాధిత కుటుంబంలో విషాధం

చంద్రగిరి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



సేహితులతో కలసి వెళ్ళిన ఈత రాని విద్యార్థి బావిలోకి దూకి గల్లంతైన విషాధ దుర్ఘటన సోమవారం చంద్రగిరి పాతపేటలో చోటుచేసుకున్నది. వివరాల్లోకితే.. స్థానిక కొత్తపేటకు చెందిన దివంగత మహబూబ్ భాషా, నూర్జహాన్‌ల కుమారుడు బషీర్ (15) పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుచున్నాడు. పాతపేట దిగువవీధి వ్యవసాయ పొలాల వద్ద గల గుండు బావిలో ఈత కోసం సేహితులతో కలసి వెళ్ళాడు. బషీర్‌కు ఈతరానప్పటికీ బావి దగ్గరకు రావడమే దూకినట్లు స్థానికులు తెలిపారు. బావిలోకి దూకిన బషీర్ ఎంతకీ పైకి రాకపోవడంతో అక్కడి రైతులు బషీర్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అదే విధంగా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బావి వద్దకు చేరుకుని ప్రజలను బావి నుండి దూరంగా పంపించి బావిలోకి గజీతగాళ్ళను పంపి విద్యార్థిని వెలికితీశారు. అయితే అప్పటికే మృతి చెందిన తమ కుమారుడిని చూసి తల్లి బోరున విలపించడంతో చూపరులను కంటతడికి గురి చేసింది.

## ప్రతి గ్రామం ఓ ఆధ్యాత్మిక నిలయంగా మారాలి:

### విగ్రహ ప్రతిష్టలో ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రతి ఒక గ్రామం ఓ ఆధ్యాత్మిక నిలయంగా మారాలని, ప్రతి గ్రామంలో అన్ని రకాల ఆలయాలు వెలయాలని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఏర్పేడు మండలంలోని పాపానాయుడుపేట మర్రిమంద గ్రామంలో లక్ష్మీ హయగ్రీవ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలకు సుధీర్‌రెడ్డి దంపతులు ముఖ్యఅతిధులుగా హాజరయ్యారు. ఆలయ కమిటి చైర్మెన్ ఆత్తూరు గిరిప్రసాద్‌రెడ్డి స్వాగతం పలికారు. గ్రామంలో పండగ వాతావరణం కల్పించారు.పాపానాయుడుపేటలో భాగమైన మర్రిమందలో బిసిలు అత్యధికంగా నివాసముంటున్నారు. ఈ గ్రామంలో లక్ష్మీ హయగ్రీవ స్వామి విగ్రహాన్ని ఆలయానికి నిర్మించాలని భావించిన గ్రామస్తులు గిరి ప్రసాద్‌రెడ్డిని ఆలయ చైర్మెన్‌గా ఎన్నుకున్నారు.ఆయన గ్రామస్తుల నుంచి విరాళాలు సేకరించి ఆలయ నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేసారు.ఈ ఆలయం ప్రారంభోత్సవం ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్ర మాలను మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాలు రాజకీ యాలకు అతీతంగా అభివృద్ధి పథంలో నడవాల్సి ఉందన్నారు. ఎక్కడైతే ఆధ్యాత్మిక చింతన ఉంటుందో అక్కడ ప్రశాంత వాతావరణం ఉంటుందని వివరించారు. నేడు ఈ ఆలయంలో విగ్రహప్రతిష్టకు రావటం తన పూర్వ జన్మసుకృతమన్నారు. మాజీమార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు,ఎంఎల్ఏ సతీమణి రిషితారెడ్డి,మాతృమూర్తి బొజ్జల బృందమ్మ,మల్లీశ్వరమ్మ, రవీంద్రరెడ్డి చైర్మెన్ ఆత్తూరు గిరిప్రసాద్‌రెడ్డి,కలత్తూరు మురళీమోహన్‌రెడ్డి,కోశాధికారి కళత్తూరు కుమార్‌రెడ్డి, గుడిమల్లం ఆలయ మాజీ కమిటి చైర్మెన్ బత్తల గిరినాయుడు ఆలయ కమిటి సభ్యులు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

## సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యులు నియమించండి

సత్యవేడు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త:



సత్యవేడు మండలం ప్రభుత్వాస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదిమూలంతో కలసి ఆస్పత్రి సలహా సంఘం వినతి అందించారు. సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను తక్షణ భర్తీ చేయాలని సోమవారం జిల్లా పరిపాలన అధికారి వెంకటేశ్వర్, ఇతర జిల్లా అధికారులను స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలం, ఆస్పత్రి సలహా సంఘం సభ్యులు శోభ, ధనశేఖర్, హేమభూషణం, స్థానిక టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేసి కోరారు. ఆస్పత్రిలో గైనకాలజిస్ట్, జనరల్ సర్జన్, సీఏఎస్ గైనకాలజిస్ట్, అనటీషియన్, జనరల్ మెడిసిన్ పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల పేదలకు సరైన వైద్య సేవలు అందడం లేదని, గర్భిణీలకు తీవ్ర అవస్థలు తప్పడం లేదని వారు జిల్లా పరిపాలన అధికారి దృష్టికి గ్రేడ్ వన్ ఫార్మాసిస్టు, మెడికల్ రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని వారు కోరారు.

# గూడూరు డివిజన్

## డిమాండ్ పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతాం

**- ఎన్ఎంయు రీజినల్ కార్యదర్శి బి ఎస్ బాబు**



వెంకటగిరి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ప్రభుత్వ పరిష్కరించకపోతే సమ్మెకు ఆయన సిద్ధమవుతామని ఎన్ఎంయు రీజినల్ కార్యదర్శి బిఎస్ బాబు హెచ్చరించారు. వెంకటగిరి ఆర్టీసీ డిపో వద్ద కార్మికుల డిమాండ్ల సాధనకు రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నట్లు తెలిపారు. డిమాండ్ పరిష్కరించాలని అన్ని డిపోల వద్ద రెండు రోజులు పాటు రిలే నిరాహార దీక్షలు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకైనా సిద్ధమవుతామని హెచ్చరించారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. డిపోల్లో చిన్నపాటి సమస్యలను కూడా పరిష్కరించడం లేదని ఆందోళన చెందారు. ఈ కార్యక్రమంలో రీజనల్ సహాయ కార్యదర్శి ఆర్ముగం, డిపోకార్యదర్శి కె.విరత్నం లు పాల్గొన్నారు.

## ప్రతిరోజు గ్రామోత్సవాలతో తిరునాళ్ల కళకళ



తడ, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : మండలం వాటంబేడుకుప్పంలో జరుగుతున్న శ్రీధర్మరాజస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవ వేడుకల్లో ప్రతిరోజు గ్రామోత్సవాలు ఆకట్టుకుంటున్నాయి. వాటంబేడుకుప్పంతో పాటు ఆ పంచాయతీ పరిధిలోని ప్రధాన గ్రామం, ఎస్సీ కాలనీలలోను రోజుకొక అలంకరణతో ఊరేగింపులు చేస్తున్నారు. సోమవారం ఉత్సవాల్లో భాగంగా మహాభారతంలోని రాజసూయ యాగం, ద్రౌపతి వస్త్రాపహరణ ఘట్టాలు ప్రదర్శించారు. సాయంత్రం తమిళనాడుకు చెందిన కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వాటంబేడుకు ఈ కళాప్రదర్శనలు తిలకించేందుకు విరివిగా భక్తులు తరలివస్తున్నారు.

## టెన్త్‌లో దివ్యాంగ విద్యార్థుల ప్రతిభ



సూళ్లూరుపేట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : ఇటీవల ప్రకటించిన టెన్త్ పరీక్షల ఫలితాల్లో దివ్యాంగ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ విద్యార్థులను భవిత స్కూలులో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వారు చూపిన ప్రతిభను కొనియాడుతూ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన సెరిబ్రల్ పాలసీ వైకల్యం కలిగిన భవిత కేంద్రం విద్యార్థిని డి.హారిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.శ్రీనివాసులు, బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న కోట పోలూరు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థి మునిసాగర్‌లను ఈ సందర్భంగా అభినందించారు. వీరికి ఎంపిఆర్‌డి అధ్యక్షురాలు నాదెండ్ల శాంతకుమారి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు నగదు అందజేయడంతో పాటు వారికి స్వీట్లు, పుస్తకాలు అందజేశారు. ఎంఇఒ శ్రీనివాసులురెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు చూపిన ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో భవిత స్కూలు ఉపాధ్యాయురాలు విటి భార్గవి, సాయిసంధ్య, సూర్యకుమారి, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విజేత జట్టుకు బహుమతి అందించిన మాజీ ఎమ్మెల్యే



ఓజిలి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : మండలంలోని పెదపరియ దగ్గర గత మూడు రోజుల నుంచి జరుగుతున్న క్రికెట్ లీగ్ మ్యాచ్లో విజేతకు బహుమతి ప్రధానోత్సవం చేయుటకు సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య విచ్చేశారు. ముందుగా ఓజిలి మండలం వైఎస్ఆర్సిపి యువత అధ్యక్షుడు బట్టా పృథ్వీ కృష్ణ యాదవ్, బట్టా బ్రదర్స్ గృహానికు మండల వైఎస్ఆర్సిపి నాయకులులతో కలిసి అల్పాహారం విందులో పాల్గొన్నారు. తదుపరి నాయుడుపేట రాజుపాలెం జట్ల మధ్య జరిగే చివరి పోరును వీక్షించి విజేతగా నిలిచిన రాజుపాలెం జట్టుకు 20 వేల రూపాయలు, ద్వితీయ స్థానంలో నిలిచిన నాయుడుపేట జట్టుకు పదివేల రూపాయలను సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి క్రీడా స్ఫూర్తి తో ఉండాలని, అందరూ కలిసి మెలిసి ముందుకు వెళ్ళాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు పాదర్తి హరినాథ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ముమ్మారెడ్డి రవీంద్రరెడ్డి, గేడి శ్రీధర్‌రెడ్డి, ఖాదర్ భాషా, ప్రభాకర్ రాజు, భాస్కర్‌రెడ్డి, బట్టా సుధాకర్, రవి, వైయస్సార్సీపి అభిమానులు పాల్గొన్నారు.

## డీసీఎంఎస్ చైర్మన్‌గా... గంగోడు నాగేశ్వరరావు నియామకం



వెంకటగిరి, ఏప్రిల్ 28 పభాతవార్త : ఉమ్మడి నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ చైర్మన్‌గా గంగోటి నాగేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీకి చెందిన నాగేశ్వరరావు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు. తెలుగుదేశం పార్టీలో ఆయన రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. తన మీద ఉన్న నమ్మకంతో సీఎం చంద్రబాబు నాయుడు బీసీ ఎంఎస్ చైర్మన్ పదవి ఇవ్వడం ఆనందంగా ఉందని నాగేశ్వరరావు తెలిపారు. తన పదవికి న్యాయం చేస్తానని చెప్పారు. నాగేశ్వరరావుకు పదవి రావడంతో ఆయన మాజీ ఏంటి చైర్మన్ రాజేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, ఆయన ఆయన స్నేహితులు ఆర్ వెంకటేశ్వ్రరావు, లక్కమనేని కోటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

## ముందస్తు పన్నులు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ



గూడూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : ముందుగా పన్నులు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరానికి ముందుగానే పన్నులు చెల్లిస్తే ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పాత బకాయిల పై 50 శాతం వడ్డీ రాయితీ కల్పించిందని ఈ అవకాశం ఏప్రిల్ 30వ తేదీ వరకు మాత్రమే అని వెల్లడించారు. పట్టణ ప్రజలందరూ టాక్స్ బకాయిలను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. చాలామంది కొళాయి పన్నులు చెల్లించడం లేదని బకాయిలు చెల్లించని ఎడల వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

## అట్టహాసంగా ప్రారంభమైన క్రికెట్ పోటీలు



చిల్లకూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : మండలంలోని గుమ్మళ్ళదిబ్బ పాతూరు నందు అట్టహాసంగా ప్రారంభమైన క్రికెట్ పోటీలు నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాలకు సంబంధించి మత్స్యకారుల క్రికెట్ పోటీలు అధాని ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్ సోమవారం ప్రారంభించారు. ఈ క్రికెట్ పోటీలకు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోటా సతీష్ యాదవ్, తిరుపతి పార్లమెంట్ మత్స్య సెల్ కార్యనిర్వాహణ కార్యదర్శి మేకల వెంకయ్య, గ్రామ కాపులు పెద్దలు యువత అధికంగా పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ సోమవారం నుండి మే 15వ తేది వరకు పోటీలు నిర్వహించబడును మొదటి బహుమతి, 60 వేల రూపాయలు రెండవ బహుమతి 40 వేల రూపాయలు, మూడవ బహుమతి 30 వేల రూపాయలు, నాలుగో బహుమతి 20వేల రూపాయలు, 5వ బహుమతి 15 వేల రూపాయలు, ఆరో బహుమతి 10వేల రూపాయలుగాను నిర్ణయించారు. ఈ టోర్నమెంట్‌కి విచ్చేసినటువంటి ముఖ్య అతిథులు క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## రీ సర్వే జరపాలని రైతుల నిరసన



కోట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : మండలం లక్ష్మక్కకండ్రిగ గ్రామంలో గతంలో జరిగిన సర్వేలో అనేక తప్పులు జరిగాయని ఆ గ్రామ రైతులు సోమవారం స్థానిక తహశీల్దార్ కె.జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సర్వేలో పొలాల హద్దులు, రైతుల పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణం బోగస్‌గా జరిగిందని ఆరోపించారు. రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని తహశీల్దార్ జయజయరావు చెప్పారు.

## సూళ్లూరుపేటలో 462వ నేత్రదానం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : పట్టణంలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు సోమవారం 462వ నేత్రదానం అందింది. బాపూజీకాలనీకి చెందిన మన్నెం తులసమ్మ (74) మృతిచెందడంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలలోని కార్నియాలను సేకరించి చెన్నై శంకర్ నేత్రాలయకు పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ సస్పెండ్‌లను ఆపాలి



గూడూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : 1/2019 సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలని, అక్రమ సస్పెండ్‌లను ఆపాలని, గ్యారేజీలో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఎన్.ఎం.యు జిల్లా ట్రెజరర్ మోహన్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో డిపోలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారానికై నిర్వహిస్తున్న మొదటి రోజు రిలే దీక్షల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు జిల్లా జాయింట్ సెక్రెటరీ శ్రవణ్, డిపో ప్రెసిడెంట్ ప్రవీణ్, సెక్రటరీ శ్రీనివాసులు, గౌస్, వెంకయ్య, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, పాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయం ఆకస్మిక తనిఖీ



వాకాడు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : మండలం పరిధిలోని కల్లూరు సచివాలయాన్ని సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు అకస్మికంగా తనిఖీ చేసారు. సచివాలయానికి సంబంధించి నటువంటి పలు రికార్డులు,రిజిస్టర్లు పరిశీలించడం జరిగినది, సచివాలయ సిబ్బంది యొక్క విధులు పట్ల అలసత్వం వహించకుండా సక్రమంగా నిర్వర్తించి గ్రామ పరిధిలో ఉన్నటువంటి ప్రభుత్వ పథకాలు ప్రజలకు సకాలంలో అందించవలసిందిగా సిబ్బందికి సూచించారు. సచివాలయ సిబ్బంది విధులు పట్ల ప్రజలకి అందుబాటులో ఉండాలన్నారు, ప్రభుత్వం తీసుకొని వస్తున్నట్టు వంటి ప్రతి ఒక్క సర్వేని ఎటువంటి తప్పులు జరగకుండా సకాలంలో పూర్తిచేసి మండలాన్ని జిల్లా పరిధిలో ముందంజలో ఉంచాలని సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగినదని తెలిపారు. ప్రస్తుతం ఉన్నటువంటి ఎండ వేడి తీవ్రతా దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులును కోరారు. కార్యదర్శి సురేష్, డిజిటల్ అసిస్టెంట్ దాసరి సునీల్ కుమార్, జువ్వినట్టు కార్యదర్శి కీర్తి, మహిళా పోలీస్ సుజాతలు పాల్గొన్నారు.

## కుప్పంలో తెలుగుతమ్ముళ్ల విజయోత్సవ ర్యాలీ

కుప్పం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త: మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకున్న నేపథ్యంలో సోమవారం కుప్పంలో తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఈ విజయానికి కారకులైన ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్‌ను పార్టీ నేతలు, కార్యకర్తలు ఆనందంతో పైకి ఎత్తి నినదించారు. మండల కార్యాలయం నుంచి పసుపు జెండాలతో తెదేపా ర్యాలీ మొదలై బస్టాండు దాకా సాగింది. అనంతరం అక్కడనుంచి శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, కన్వీనర్ ఆర్. చంద్రశేఖర్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, ఆనందరెడ్డి, బాబు, నేతలు సత్యేంద్రశేఖర్, కన న్నన్, ప్రతాప్, ఆర్ముగం, రవి, మంజు, కౌన్సిలర్లు, నాలుగు మండలాల నేతలు, జనసేన నరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రుణాల కోసం దరఖాస్తులు చేసుకోండి : ఎంపీడీవో

వెంకటగిరి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : 2025-26వ సంవత్సరం కోసం షెడ్యూల్ కులాలవారు రుణాల కోసం మే నెల పదో తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె వి కోటేశ్వరరావు తెలిపారు. వెంకటగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆన్లైన్లో అందరూ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల కోసం ఫోటో స్టూడియో, ఆటో, మినీ లారీ, తదితర రుణాలు ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన గనులు : ఎంఈఓ



వెంకటగిరి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త: గ్రంథాలయాలు విజ్ఞాన గనులని ఎంఈఓ బాబయ్య తెలిపారు. వెంకటగిరి గ్రంథాలయంలో విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. చిన్నారులు వేసవికాలంలో గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. గ్రంథాలయాలకు వచ్చి చదివిన చిన్నారులు ఉన్నత స్థాయిలో ఉన్నట్లు తెలిపారు. టీవీలు, సెల్ ఫోన్లు పక్కనపెట్టి గ్రంథాలయాలకు వచ్చి చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అల్లిశెట్టి అంజయ్య, తెలుగు లెక్చరర్ గుర్రాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కోట బార్ అసోసియేషన్ ఎన్నికలు



కోట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : కోట బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం కోట కోర్టు ప్రాంగణంలో జరిగాయి. ఈ ఎన్నికల అధికారిగా ఎల్.రామచంద్రరావు వ్యవహరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షులుగా మోహన్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కాటయ్య, సభ్యులుగా సూర్య, సాగర్‌లను ఎన్నుకున్నారు.

## సంఘమిత్ర నూతన కమిటీ నియామకం



కోట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : కోటలోని వెలుగు కార్యాలయంలో సోమవారం మండల సంఘమిత్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా ముత్యా లమ్మ, కార్యదర్శిగా షమీర్, కోశాధికారిగా మల్లేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా వెంకట రమణమ్మ, సంయుక్త కార్యదర్శిగా దేవికారాణిలను ఎన్నుకున్నట్లు ఎపిఎం అనిల చెప్పారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కోట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : మండలం లక్ష్మక్కకండ్రిగ గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మోడల్ మేకర్ 1 శ్రీనివాసులు మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి డేటా సేకరించడం జరుగుతుందని చెప్పారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే నవధాన్యాలు చల్లడం వలన లాభాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం చేసే శేషాచలం, జనార్ధన్ అనే రైతులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వీఎఎ దినేష్, అంగన్‌వాడీ మండల ఇన్‌ఛార్జ్ పద్మ, భాగ్యలక్ష్మి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులకు రూ.10 వేలు వితరణ



కోట, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : కోటలోని హరిజనవాడకు చెందిన అరుణ జ్యోతికి ఆరోగ్యం బాగలేకపోవడంతో దీన స్థితిని అర్థం చేసుకొని షిరిడీ సాయి అక్షయ సేవాసమితి అధ్యక్షుడు రమణయ్య పది వేల రూపాయలు చెక్కు అందజేశారు. ఈ చెక్కును చెన్నైకి చెందిన దాత నాగలాపురం గిరిధం రెడ్డి దాతృత్వం చేశారని అల్లం రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా అరుణ జ్యోతి వెంకటేశ్వర్లు షిరిడి సాయి అక్షయ సేవాసమితి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు బాబురావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ప్రవేశ పరీక్షలో మెరిసిన గూడూరు వాసి



గూడూరు, ఏప్రిల్ 28 ప్రభాతవార్త : పట్టణం కర్ణాలవీధికి చెందిన డాక్టర్ పర్వత కీర్తి కుమార్ దేశ వ్యాప్తంగా సూపర్ స్పెషాలిటీ ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్షలో సత్తా చాటాడు. శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఆయన 132వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం కీర్తి కుమార్ గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ కీర్తి కుమార్ ఈ ర్యాంక్ సాధించడంతో ఆయన తల్లిదండ్రులు,బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఆయన ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరులోని కర్ణాలవీధికి చెందిన పర్వత వెంకట రమణయ్య, కోటేశ్వరి దంపతుల కుమారుడు డాక్టర్ పర్వత కీర్తికుమార్ వారి కుటుంబంలో చిన్నవాడుఆయన తండ్రి పర్వత వెంకట రమణయ్య వృత్తిరీత్యా నాగార్జున అగ్రికెమ్ లిమిటెడ్ ప్రయివేట్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆమె వృత్తి రిత్యా ఏపీఎస్పీడీసీఎల్ గూడూరులో జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. డాక్టర్ కీర్తి కుమార్ ప్రస్తుతం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తూ నీట్ సూపర్ స్పెషాలిటీ 2025 ప్రవేశాల పరీక్షలో జాతీయ స్థాయిలో 132వ ర్యాంకు సాధించారు.

## బంగారు నగలు చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

**301 గ్రాముల బంగారు, రూ.6 లక్షలు నగదు స్వాధీనం- పోలీసు సిబ్బందికి ఎస్పీ నగదు రివార్డులు. డిఎస్పీ బేతపూడి ప్రసాద్**

చంద్రగిరి, ఏప్రిల్ 28 ప్రభాతవార్త: బంగారు నగలు చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డిఎస్పీ బేతపూడి ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలోని కొత్తఇండ్లుకు చెందిన దొమ్మలపాటి సిద్ధయ్య నాయుడు ఫిర్యాదు మేరకు.. డిఎస్పీ పర్యవేక్షణలో సిఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ అనిత, సిబ్బంది మునిరాజ, పురంధర్, గోపి నిందితుడిని అరెస్ట్ చేయడంలో సమర్థవంతంగా వ్యవహరించి ఎస్పీవి.హర్షవర్ధన్ రాజు అభినందనలతో పాటు సిబ్బంది నగదు రివార్డులను అందుకున్నారు. సోమ వారం డిఎస్పీ విలేకరుల సమావేశంలో మాట్లా డుతూ తిరుపతి రూరల్ మండలం, ఎంఆర్ పల్లి పంచాయతీ, శ్రీకృష్ణ నగర్‌కు చెందిన నిందితుడు పులి నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. గ్రామం లోని పెద్దమనుషుల సమక్షంలో విచారణ జరిపి అతని నుండి 195.5 గ్రాముల బంగారు నగలు, రూ.3 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా బెంగు ళూరుకు సంబంధించిన కేసులో ఒక స్కూటీని సీజ్ చేశారు. నిందితుడు ఇప్పటికే పలు కేసుల్లో జైలుకు వెళ్ళినట్లు గుర్తించారు. ఈ కేసులో ఇదివరకే ప్రథమ నిందితుడు పల్నాడు జిల్లా, మిర్యాల గ్రామానికి చెందిన షేక్ బాబవల్లిని తెలంగాణ, సూర్యాపేట జిల్లా, మునగాల పోలీస్ స్టేషన్‌లో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. అప్పట్లోనే నిందితుడి నుండి రూ.3 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 105.5 గ్రాముల బంగారు నగలును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

## స్కిట్ కళాశాల పునఃప్రారంభానికి సన్నాహాలు | రెండేళ్ళ పాటు దేవాదాయశాఖ ఆర్థిక సహాయం



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 28 ప్రభాతవార్త: ఏడేళ్ళ సుదీర్ఘ విరామం తరువాత ఈ విద్యాసంవత్సరం నుంచి పునః ప్రారంభానికి సిద్ధం చేసినట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సోమవారం తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పాలనను గాడిలో పెడుతూ మూతపడ్డ విద్యాసంస్థలను తెరవటం ఖాయిలా పడ్డ ప్రభుత్వాసుపత్రికి సదుపాయాల చికిత్స జరపటానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు.పంచాయతీరాజ్ అతిధి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో 1999లో తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి నియోజకవర్గంలోని నిరుపేదలకు అందుబాటులో సాంకేతిక విద్యను అందించుటకు దేవాదాయశాఖ పరిధిలో స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసారన్నారు.అయితే 2019 నుంచి ఈ కళాశాల పర్యవేక్షణ కొరవడి మూతపడిందన్నారు. తాను ఎన్నికల సమయంలో పునః ప్రారంభానికి భరోసా ఇచ్చానన్నారు.ఈ మేరకు పలు మార్లు విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌తోనూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తెచ్చా మని ఈ కళాశాలను అనంతపురంజెయన్‌టియుకు అప్పగించుటకు నిర్ణయించా మన్నారు.

**రెండేళ్ళ పాటు దేవస్థానం ఆర్థిక సహాయం:**

శ్రీకాళహస్తి దేవస్థానంకు అనుబంధంగా నిర్వహించే స్కిట్‌ఇంజనీరింగ్ కళాశాల పునఃప్రారంభానికి రెండేళ్లపాటు దేవస్థానం ఆర్థిక సహాయం చేయటానికి ప్రత్యేక కమిటి మే 4వ తేదీ సమావేశం అయి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 15 నుంచి కార్యక్రమాలను ప్రారంభించి అడ్మిషన్లను చేపట్టుటకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను అనంతపురం జెయన్‌టి యుకు లీజుకు ఇవ్వటానికి ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఎంఎల్ఏ వివరించారు. పలుమార్లు జెయన్‌టియు, ప్రభుత్వ స్థాయిలో సమావేశాలను నిర్వహించామన్నారు. అడ్మిషన్లు బాగా జరిగి ఆర్థిక పరిపుష్టి కల్గిన తరువాత దేవాదాయశాఖ ఎంత చెల్లించిందో ఆ మొత్తాలను దశల వారికి తిరిగి చెల్లించే ఒప్పంద ంతో ఆర్థిక సహాయం చేస్తున్నట్లు వివరించారు. అన్ని అంశాలు నరేంద్రమోడీ పర్యటన తరువాత ఖరారు అవుతాయని వివరించారు. స్కిట్ పునఃప్రారంభానికి మంత్రి నారాలోకేష్ సహకారం మరువరానిదన్నారు. కోట్ల విలువ చేసే 50ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించా మన్నారు. అంతేకాక ఈ కళాశాల భవనాలకు కోట్లు వెచ్చించామన్నారు.కానీ ఇక్కడ కొందరు ఉన్నత స్థాయి ఉద్యోగులు రాజకీయం చేయటంతో కళాశాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అయితే ప్రస్తుతం మంత్రి లోకేష్ దేవాదాయశాఖ చొరవతో జెయన్‌టియుకు బాధ్యతలు అప్పగించనున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు ఇదో శుభవార్త అని ఇక్కడ చదువుకునే విద్యార్థులకు ఉద్యోగవ కాశాలకు శ్రీకాళహస్తిలో ఎన్నో పరిశ్రమలు ఉన్నాయని ఇంకా వస్తాయని సుధీర్‌రెడ్డి వివరించారు. చెంచయ్యనాయుడు, విజయకుమార్, దుర్గా ప్రసాద్‌లు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారాల గ్రహీతలకు ఘన సత్కారం



కాణిపాకం, ఏప్రిల్ 28 ప్రభాతవార్త: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి తుమ్మలపల్లె కళాక్షేత్రంలో గతనెలలో జరిగిన ఉగాది వేడుకల్లో ఉగాది పురస్కారాలు అందుకున్న కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు చెందిన అర్చకులు, వేదపండితులను సోమవారం దేవస్థానం తరఫున ఘనంగా సత్కరించారు. ఉగాది పండుగ సందర్భంగా తుమ్మలపల్లె కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకల్లో భాగంగా రాష్ట్రంలోని పలువురు ప్రముఖులు, ఆలయానికి చెందిన అర్చకులు, వేదపండితులను ప్రభుత్వం సత్కరించి ఉగాది పురస్కారాలను అందజేసింది. ఈమేరకు కాణిపాకం ఆలయానికి చెందిన ఉప ప్రధాన అర్చకులు ఎస్.ఎస్.గణేష్ గురుకుల్, వేదపండితులు సత్య నారాయణ శర్మలను ఉగాది పురస్కారాలను అందజేశారు. అలాగే జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్న వేదపండితులటు సుబ్బారావులను ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు,అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.


### పుత్తూరు పురపాలకసంఘ కార్యాలయం, పుత్తూరు

ఆర్.ఒ.సి.నెం.90/ఎ1/2018 **బహిరంగ వేలము ప్రకటన / సీల్డ్ టెండర్ ప్రకటన** తేది:25.04.2025

పుత్తూరు పురపాలకసంఘ ఆదాయవనరులైన షాపింగ్ కాంప్లెక్స్ దినసరి కూరగాయల మార్కెట్ నందలి అంగడి గదులు, ఖాళీ జాగా మరియు మటన్ స్టాల్స్/షాపులు అద్దె ప్రాతిపదికన ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టము సెక్షన్277 ననుసరించి 3 సంవత్సరముల కాలపరిమితికి అద్దెకు/లీజుకు ఇచ్చుటకుగాను పురపాలక సంఘ కార్యాలయము నందు తేది: 13-05-2025న ఉదయం 11.00గంటలకు కమిషనరు గారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగవేలం/సీల్డ్ టెండర్ నిర్వహించబడును. వేలము నందు పాల్గొనువారు పుత్తూరు పురపాలకసంఘ అసాధారణ రాజపత్రం నెం.01/2025, తేది 03-1-2025 నందలి షరతులను పాటించవలెను.

| వ. నెం. | వివరములు | షాపు రూము సంఖ్య | సాల్వెన్సీ ధృవీకరణ పత్రము మరియు డిపాజిట్ మొత్తం రు. | బహిరంగవేలం నందు పాటఖరారైన హెచ్చు పాటదారుడు మూడు మాసముల అద్దె (జిఎస్‌టి)తో కలిపి ముందస్తుగా చెల్లించవలెను. |
|---|---|---|---|---|
| 1. | షాపింగ్ కాంప్లెక్స్ | 3,6,13,14, 15,16, 17,24,25 | 1,00,000/- | |
| 2. | మటన్ షాపులు/స్టాల్స్ | 2,5,6,7,8 | 50,000/- | |
| 3. | డి.వి.ఎం, దినసరి కూరగాయల మార్కెట్ | 1,3,4,6,7,8,9,10,11,12,20, 21, 22,23,24,25, 26,27,28,30, 31,33,34,35 | 30,000/- | |
| 4. | ఖాళీజాగలు (ఓపెన్ స్పేసెస్) | 1,2,3,4 మరియు 15 | 50,000/- | |

1.వేలం పాటలో పాల్గొనే గుత్తదారుడు ధరావత్తును మరియు సాల్వేన్సీని సమర్పించవలెను, అట్లు సమర్పించని యెడల పాటలో పాల్గొనటకు అనర్హులు. 2. బహిరంగ వేలములో హెచ్చు పాట ఖాయపరచబడును. లీజు అగ్రిమెంట్ హెచ్చు పాటదారుల స్వంత ఖర్చులతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నందు రిజిస్టరు చేయించుకొని కాపీ మునిసిపల్ ఆఫీసుకు అందజేయవలెను. 3. బహిరంగ వేలము పాట వాయిదా వేయుటకు, నిరాకరించుటకు కమిషనరు గారికి పూర్తి అధికారము కలదు. 4. ఒకరి తరపున మరొకరు వేలము పాటలో పాల్గొనకూడదు. 5. హెచ్చు పాటదారులు ఏ నెల బాడుగ ఆదే నెల 5వ తేదీలో చెల్లించవెను. 6. సీల్డ్ టెండరు విరములు : పై తెలిపిన షాపు రూములు లీజు గుత్తకు ఇచ్చుటకుగాను, ఆసక్తి గల గుత్తదారుల నుండి సీల్డ్ టెండర్ తేది 13-05-2025న ఉదయం 10.30గంటల వరకు స్వీకరించబడి అదే రోజు ఉదయం 11.00గంటలకు హాజరైన లీజుదారుల సమక్షము నందు తెరువబడును.

టెండరు షెడ్యూల్ పొందుటకు గడువు లేది : 09-05-2025 సా॥ 4.00గంటల వరకు

టెండర్ షెడ్యూల్ ధర : రూ.250/-

ధరావత్తు చెల్లించుటకు గడువు తేది : 09-05-2025 సా॥ 4.00గంట వరకు

గమనిక: ఇతర వివరములకు/షరతులకు రెవెన్యూ ఆఫీసర్, ఫోన్ నెం.8374488926

రెవెన్యూఇన్‌స్పెక్టర్ ఫోన్ నెం : 9848859456/ 9949081843 ని సంప్రదించవలెను.

సం/- ఎం.మంజునాథ్ గౌడ్
కమిషనర్, పుత్తూరు పురపాలక సంఘం